www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం

07-12-2024

సంపుటి : 01 । సంచిక : 215 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







# డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు



## ఈకేసుల్లో 6 నెలల్లోగా తీర్పులు వచ్చేలా చూస్తాం

- గంజాయి, కొకైన్, హెరాయిన్.. మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నాయి
- వీటిపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలి.
- యువతకు సైబర్ క్రైమ్ విభాగంలో శిక్షణ ఇవ్వాలి
- పోలీసుల పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తాం
- మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం..
- ట్రాన్స్‌జెండర్లకు అండగా ఉంటాం:సీఎం

**హైదరాబాద్:** అంబేడ్కర్ అందించిన రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. రాజకీయ ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పైరవీలు లేకుండా పోలీసులకు పదోన్నతులు, బదిలీలు జరిపామన్నారు. పోలీసు, అగ్నిమాపక శాఖలో 15వేల మందికి నియామక పత్రాలు అందించామని తెలిపారు. పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు కూడా కానిస్టేబుల్ ఉద్యోగాలకు వస్తున్నారన్నారు. ''సైబర్, డ్రగ్స్ రూపంలో కొత్త నేరాలు పుట్టుకొస్తున్నాయి. గంజాయి, కొకైన్, హెరాయిన్.. మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నాయి. యువతకు సైబర్ క్రైమ్ విభాగంలో శిక్షణ ఇవ్వాలని డీజీపీని కోరుతున్నా. టీజీ న్యాబ్‌కు డీజీపీ స్థాయి అధికారిని నియమించాం. కఠిన చర్యలు చేపట్టి గంజాయి, డ్రగ్స్‌ను అరికడుతున్నాం. డ్రగ్స్ రవాణాదారులు ఇక్కడికి రావాలంటేనే మిగతా2లో...

## గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదు

పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

తెలంగాణ ప్రభుత్వానికి ఊరట


2

గ్రూప్-1 అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

## తెలంగాణకు 7 నవోదయ పాఠశాలలు

కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్!



2

దేశంలో కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ఏపీలో 8 కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణలో 7 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## ఖర్గే మాటలు.. మోదీ నవ్వులు

పార్లమెంట్ ఆవరణలో అరుదైన దృశ్యం

సామాజిక మాధ్యమాల్లో వైరల్


2

## రాబోయే రోజులన్నీ.. తూర్పు, ఈశాన్య భారతావనివే

2

## కవ్వింపు చర్యలు ఆపని బంగ్లా

- భారత సరిహద్దుల్లో కిల్లర్ డ్రోన్ల మోహరింపు
- హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో పెరిగిన ఉగ్రవాదుల కదలికలు


2

## తెలంగాణ తల్లి రూపంపై వీడిన సస్పెన్స్

బహిర్గతమైన నమూనా

- 17 అడుగుల కాంస్య విగ్రహం సిద్ధం
- 9న సచివాలయంలో ఆవిష్కరించనున్న సీఎం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లి రూపంపై సస్పెన్స్ వీడింది. ఈనెల 9న సచివాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహం నమూనా బహిర్గతమైంది. బంగారు అంచుతో కూడిన పచ్చటి చీర, ఎరుపురంగు జాకెట్, నుదుటన తిలకంతో తెలంగాణ తల్లి రూపుదిద్దుకుంది. చేతిలో మొక్కజొన్న.. వరి సజ్జలు ఉన్నాయి. విగ్రహం కింద గద్దెపై బిగించిన పిడికిలిని మిగతా2లో...




## అడ్డగోలుగా మాట్లాడటమే పనిగా బీఆర్ఎస్ నేతలు

గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేసింది

- మా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు రూ.61వేల కోట్లు వెచ్చించాం
- రైతు భరోసా, రుణమాఫీ, చేయూత, ఆరోగ్యశ్రీ పథకాలకు నిధులు కేటాయించాం
- మీడియా సమావేశంలో భట్టి

**విశ్వంభర, హైదరాబాద్:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''బీఆర్ఎస్ రూ.7 లక్షల కోట్ల అప్పు చేసింది. మా ప్రభుత్వం వచ్చాక రూ.52 వేల కోట్ల అప్పు చేశాం. చేసిన అప్పులను తిరిగి బ్యాంకులకే కట్టే పరిస్థితికి తెచ్చారు. అప్పులకు అదనపు ఆదాయం కలిపి బ్యాంకులకు కట్టే పరిస్థితి వచ్చింది. సంక్షేమ పథకాలకు రూ.61వేల కోట్లు వెచ్చించాం. రైతు భరోసా, రుణమాఫీ, చేయూత, ఆరోగ్యశ్రీ పథకాలకు నిధులు కేటాయించాం. ప్రతి రోజు అడ్డగోలుగా మాట్లాడటమే బీఆర్ఎస్ నేతలు పనిగా మిగతా2లో...

## నేను అడిగితేనే ఉప ముఖ్యమంత్రిగా అంగీకరించారు

- ప్రమాణస్వీకారోత్సవానికి రెండు రోజుల ముందే నేను శిందేతో భేటీ అయ్యాను
- వ్యక్తిగతంగా ఆయనతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి
- మహారాష్ట్ర నూతన సీఎం ఫడ్నవీస్

2



మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 80 | ₹ 103 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 148 | ₹ 168 |

## రేపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం

- ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మీటింగ్
- వెల్లడించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## ముగింపు వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



- సీఎస్ ఆదేశాలు
- అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన శాంతికుమారి

2

## రాహుల్, రేవంత్‌వి బూటకపు హామీలు

- వాటితో యువతను మోసం చేశారు
- హామీల అమలుపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు



**విశ్వంభర, హైదరాబాద్:** బూటకపు హామీలతో తెలంగాణ యువతను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. యువకులకు ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. హామీలు మిగతా2లో...

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ చక్రపాణి

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మూడేళ్లపాటు కొనసాగనున్న ఘంటా


2

## గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదు

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్-1 అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కొత్త నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని కొందరు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని హైకోర్టును కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టుల జోక్యంతో నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. మెయిన్స్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఫిబ్రవరిలోగా మెయిన్స్ ఫలితాలు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ తెలిపింది.

## తెలంగాణకు 7 నవోదయ పాఠశాలలు

**ఢిల్లీ:** దేశంలో కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ఏపీలో 8 కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణలో 8 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఏపీలోని అనకాపల్లి, వలసపల్లె (చిత్తూరు జిల్లా), పాలసముద్రం (సత్యసాయి జిల్లా), తాళ్లపల్లి (గుంటూరు), నందిగామ(కృష్ణా జిల్లా), రొంపిచర్ల(గుంటూరు), నూజివీడు (ఏలూరు జిల్లా), ధోన్ (నంద్యాల జిల్లాలో) ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఇక తెలంగాణలో జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో 7 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయబోయే 85 కేంద్రీయ విద్యాలయాల కోసం రూ.5872 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఇవి అందుబాటులోకి వస్తే ఒక్కో కేంద్రీయ విద్యాలయంలో 960 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. ఇక కొత్తగా 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు రూ.2359.82 కోట్ల వరకు ఖర్చు కానుంది. ఒక్కో నవోదయ విద్యాలయంలో 560 మంది విద్యార్థులకు అవకాశం దక్కనుంది.

## రేపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్:** ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం కానున్నారు. ఈ సమావేశం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జరగనుంది. ఈ విషయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ చక్రపాణి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం వైస్ ఛాన్స్‌లర్‌ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిని నియమిస్తూ ఉత్తర్వులు వెల్లడించింది. ఈ పదవిలో చక్రపాణి మూడేండ్ల పాటు కొనసాగనున్నారు. గతంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చక్రపాణి విధులు నిర్వర్తించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్‌గా ఘంటా చక్రపాణి సేవలందించారు.

## రాబోయే రోజులన్నీ.. తూర్పు, ఈశాన్య భారతావనివే

- ఓట్లు, సీట్లు తక్కువగా ఉండటంతో గత పాలకులు అభివృద్ధిపై దృష్టిపెట్టలేదు
- దశాబ్ద కాలంలో కేంద్రమంత్రులు 700 సార్లు ఇక్కడ పర్యటించారు
- అష్టలక్ష్మి మహోత్సవ్ కార్యక్రమంలో ప్రధాని మోదీ

**ఢిల్లీ:** రాబోయే రోజులన్నీ.. తూర్పు, ఈశాన్య భారతావనివేనని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని అష్టలక్ష్మి మహోత్సవ్ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. ఈశాన్య ప్రాంతం గొప్ప సంస్కృతి, చైతన్యవంతమైన వ్యక్తులతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే అపారమైన సామర్థ్యంతో ఉందన్నారు. గత ప్రభుత్వాలు చాలా కాలంగా ఓట్ల సంఖ్యతో అభివృద్ధిని ఎలా తూకం వేశాయో చూశామని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఓట్లు, సీట్లు తక్కువగా ఉండటంతో గత పాలకులు అభివృద్ధిపై దృష్టిపెట్టలేదని దుయ్యబట్టారు.ఢిల్లీ.. ఈశాన్య ప్రాంత ప్రజల మనస్సులకు దూరమనే భావనను తగ్గించేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైనప్పట్నుంచి ప్రయత్నించామన్నారు. ఈ దశాబ్ద కాలంలో కేంద్రమంత్రులు 700 సార్లు ఇక్కడ పర్యటించారని, ప్రజల మనోభావాలు, ఆర్థిక వ్యవస్థ, జీవావరణంతో ఈశాన్య ప్రాంతాలను అనుసంధానం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు.

## అడ్డగోలుగా మాట్లాడటమే పనిగా బీఆర్ఎస్ నేతలు




(మొదటి పేజీ తరువాయి)
పెట్టుకున్నారు. త్వరలోనే కొత్త విద్యుత్ విధానం ప్రకటిస్తాం. అందరూ వద్దంటున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టు కట్టింది. కేంద్రం జాప్యం వల్ల భద్రాద్రి ప్రాజెక్టుపై 42శాతం అదనపు భారం పెరిగింది. ప్రాజెక్టుపై పెరిగే ధరలన్నీ కలిపి అంతిమంగా ప్రజలపై భారం వేశారు. విద్యుత్ రంగం గురించి చాలా దుష్ప్రచారం చేశారు. మీరు చేసిన తప్పుడు ప్రచారాన్ని మేం సమర్థంగా తిప్పికొట్టాం. విద్యుత్ విషయంలో సమగ్ర వివరాలను ప్రజలముందుంచాం. గతేడాదికంటే విద్యుత్ డిమాండ్ పెరిగినా నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. మేం వచ్చాక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు గుర్తించాం. ఉత్పత్తి కేంద్రాల సమాచారం అంతా ప్రజలకు చెప్పాం. థర్మల్ ఎనర్జీ వల్ల కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది'' అని భట్టి విక్రమార్క వివరించారు.

# డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు

(మొదటి పేజీ తరువాయి)
భయపడాలి. డ్రగ్స్ విష వలయం గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలి. ప్రత్యేక శిక్షణ పొందిన వారితో విద్యార్థులకు పాఠాలు చెప్పించాలి. పిల్లల భవిష్యత్తు గురించి పాఠశాలల యాజమాన్యాలకు బాధ్యత ఉండాలి. విద్యా సంస్థల యాజమాన్యాలతో పోలీసు కమిషనర్లు సదస్సులు నిర్వహించాలి. డ్రగ్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి 6 నెలల్లోగా తీర్పులు వచ్చేలా చూస్తాం'' అని సీఎం తెలిపారు.

**మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం..**

''రాష్ట్రంలో 14వేల మంది హోంగార్డులు ఉన్నారు. వారికి రోజుకు రూ.1000 వేతనం ఇస్తాం. హోంగార్డుల వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.200 చేస్తాం. మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తాం. వారికి మెరుగైన సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జనవరి 1లోగా అందించేలా చర్యలు తీసుకుంటాం. పోలీసుల పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తాం. యంగ్ ఇండియా పోలీస్ స్కూలుకు 50 ఎకరాలు కేటాయించాం. హోంగార్డు నుంచి డీజీపీ వరకు ఏ హోదాలో ఉన్నా.. వారి పిల్లలు ప్రవేశం పొందవచ్చు.

**నేరగాళ్ల హోదా చూసి పోలీసులు వెనక్కి తగ్గొద్దు..**

రాష్ట్రంలో మొత్తంగా 94 వేల మంది పోలీసులు ఉన్నారు. ఎక్కడ తీవ్రవాద కార్యకలాపాలు జరిగినా మన పోలీసుల సాయం తీసుకుంటాం. పోలీసు ఉద్యోగం భావోద్వేగం.. ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే బాధ్యత. బాధితుల పట్ల పోలీసులంతా గౌరవంగా, మర్యాదగా మెలగాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లు, కబ్జారాయుళ్లకు అండగా ఉండటం కాదు. పోలీసు పేరు వినిపిస్తే చాలు.. నేరగాళ్లు భయపడేలా ఉండాలి. కొందరు పోలీసుల తీరు కారణంగా అందరికీ చెడ్డ పేరు వస్తుంది. నేరగాళ్ల పట్ల కఠిన వైఖరి ప్రదర్శించాలి. స్టేషన్‌కు వచ్చిన ఏ ప్రజాప్రతినిధి అయినా మర్యాదగా వ్యవహరించాలి. పేదలు, సామాన్యులు, బాధితులకు పోలీసులు అండగా ఉండాలి. నేరగాళ్ల హోదా చూసి పోలీసులు వెనక్కి తగ్గొద్దు. విధి నిర్వహణలో మరణించిన అధికారులు, పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం.



**ట్రాన్స్‌జెండర్లకు అండగా ఉంటాం..**

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చూడాలి. ట్రాన్స్ జెండర్ల సమస్యలను ప్రతి ప్రభుత్వం మానవీయ కోణంలో చూడాలి. ట్రాన్స్ జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నాం. వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తాం. వారికి మా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది'' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## ముగింపు వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



**విశ్వంభర,హైదరాబాద్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా డిసెంబర్ 7,8,9 తేదీలలో జరిగే కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ముగింపు వేడుకల ఏర్పాట్ల పై ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మూడు రోజులు జరిగే కార్యక్రమాల పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీష్ ను ఆదేశించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ముగింపు వేడుకలకు ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, తాగునీరు, టాయిలెట్స్ మొదలగు మౌలిక వసతుల ఏర్పాటు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ట్యాంక్ బండ్ వద్ద 8 వ తేదీన జరిగే ఎయిర్ షో కు భారత వైమానిక దళం అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. 09 వ తేదిన ట్యాంక్ బండ్ పై నిర్వహించే డ్రోన్ షో కూ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రముఖ సంగీత కళాకారులు వందేమాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లీగంజ్, ప్రముఖ సినీ సంగీత దర్శకులు థమన్ ల సంగీత కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వేదికల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కళాకారుల సౌకర్యార్థం వారికి ప్రత్యేక గ్రీన్ రూం ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలను అందరూ వీక్షించేందుకు వీలుగా రోడ్డుకు ఇరు వైపులా ఎల్ ఈ డి స్క్రీన్ లను ఏర్పాటు చేయాలన్నారు. డిసెంబర్ 09 వ తేదిన సచివాలయ ప్రాంగణంలో జరిగే తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం, బహిరంగ సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. బహిరంగ సభకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తో పాటు, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్త, డిజిపి జితేందర్, మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్, జీఏడి కార్యదర్శి రఘునందర్ రావు , జీహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సెర్ప్ సీఈఓ దివ్య, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీష్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ వైమానిక దళ అధికారులు పాల్గొన్నారు.

## నేను అడిగితేనే ఉప ముఖ్యమంత్రిగా అంగీకరించారు



**ముంబయి:** బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలో మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాను అడిగితేనే ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే అంగీకరించారని ఆయన పేర్కొన్నారు. 'ఎన్నికల్లో విజయం తర్వాత జరిగిన మహాయుతి తొలి సమావేశంలో సీఎం అభ్యర్థి బీజేపీ నుంచి ఉండేందుకు ఏక్‌నాథ్ శిందే అంగీకరించారు. అయితే, శిందే ప్రభుత్వంలో భాగం కాకూడదని, మహాయుతి కూటమి సజావుగా సాగేందుకు నేతృత్వం వహిస్తే చాలని శివసేనలోని ఓ వర్గం భావించింది. తమ పార్టీ నుంచి సీఎం కావాలని శివసేన నాయకులు కోరుకున్నారు. వ్యక్తిగతంగా శిందేతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రమాణస్వీకారోత్సవానికి రెండు రోజుల ముందే నేను శిందేతో భేటీ అయ్యాను. అప్పుడే ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరించారు' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 స్థానాల్లో మహాయుతి కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే సీఎం ఎవరనే అంశంపై కూటమి నేతల మధ్య తీవ్రమైన చర్చలు జరిగాయి. బీజేపీ సీనియర్ నాయకుడు దేవేంద్ర ఫడ్నకే ఆ బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు అందరూ ఊహించారు. అందుకుతగ్గట్టుగానే బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఫడణవీస్ పేరును ప్రతిపాదించగా.. అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. మరోవైపు రెండున్నరేళ్ల పాటు సీఎం పదవిలో కొనసాగిన శిందే.. డిప్యూటీ సీఎం బాధ్యతలను తీసుకునేందుకు నిరాకరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునేందుకు శిందే అంగీకరించడంతో ఆ ఊహాగానాలకు చెక్ పడింది. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్, శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అగ్రనేత అజిత్‌పవార్‌లు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

## శంభు సరిహద్దుల్లో ఉద్రిక్తత..

- దిల్లీ చలో' కార్యక్రమంలో పోలీసుల, రైతుల మధ్య వాగ్వాదం
- రైతులపై బాష్పవాయువు ప్రయోగం



**ఢిల్లీ:** పంటలకు కనీస మద్దతుధర కల్పించడంతోపాటు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ.. హరియాణా, పంజాబ్ రైతులు చేపట్టిన ' దిల్లీ చలో' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. సంయుక్త కిసాన్ మోర్చ నేతృత్వంలో వందలాది మంది రైతులు శంభు సరిహద్దు గుండా రాజధానిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. బారికేడ్లను దాటుకొని రైతులు దిల్లీ వైపు కదిలేందుకు యత్నించారు. ఈ క్రమంలో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. మరోవైపు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కనీస మద్దతు ధరపై పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మోదీ గ్యారంటీని కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ఉత్పత్తి ధరకంటే కనీసం 50శాతం అధికంగా చెల్లించి పంటను కొనుగోలు చేయాలన్న ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పరిగణనలోకి తీసుకోలేమని గతంలో కాంగ్రెస్ చెప్పిందని చౌహాన్ సభకు వివరించారు. కానీ, మోదీ ప్రభుత్వం ఇప్పటికే ధాన్యం, గోధుమలు, సోయాబీన్, జొన్న పంటలకు ఉత్పత్తి ధరకంటే 50 శాతం అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తోందని వివరించారు.

## కవ్వింపు చర్యలు ఆపని బంగ్లా

**ఢిల్లీ:** బంగ్లాదేశ్ కవ్వింపు చర్యలు ఏమాత్రం ఆగడం లేదు. తాజాగా తుర్కియే తయారుచేసిన బేరక్తర్ టీబీ2 డ్రోన్‌ను పశ్చిమబెంగాల్ వద్ద మోహరించింది. దీనిపై ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్స్ అందడంతో అప్రమత్తమైన భారత్ నిఘాను ఒక్కసారిగా పెంచింది. బేరక్తర్‌ల మోహరింపుపై వచ్చిన నివేదికలను సైన్యం కూడా పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్లను బంగ్లాదేశ్ 67వ ఆర్మీ యూనిట్ ఇంటెలిజెన్స్, నిఘా, గస్తీ కోసం వినియోగిస్తోంది. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో ఉగ్రవాదుల కదలికలు గణనీయంగా పెరిగాయి. దాదాపు 700 మంది ఉగ్రవాదులు, ఖైదీలు ఇప్పటికే జైళ్ల నుంచి తప్పించుకొని ఆ దేశంలో తిరుగుతున్నారు. తాజాగా సరిహద్దుల వద్ద తీవ్రవాదులు, స్మగ్లింగ్ ముఠాలు బలపడుతున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు వస్తున్నాయి. ఈ ఏడాది మొదట్లోనే బంగ్లాదేశ్ ప్రభుత్వం తుర్కియే నుంచి బేరక్తర్ డ్రోన్లను కొనుగోలు చేసింది. ఇవి తేలికపాటి దాడులు కూడా చేయగలవు. బంగ్లాదేశ్ 12 ఆర్డర్ చేయగా.. వాటిల్లో 6 ఇప్పటికే ఆ దేశానికి అందాయి. ఈ డ్రోన్ దాదాపు 25,000 అడుగుల ఎత్తు వరకు ఎగిరి లేజర్ గైడెడ్ బాంబులను ప్రయోగించగలదు. ముఖ్యంగా శతఘ్నులు, ట్యాంక్‌లకు ఈ రకం డ్రోన్లు సమస్యలు సృష్టించగలవు. ఉక్రెయిన్ యుద్ధంలో కూడా రష్యా ట్యాంకులను ఇవి దెబ్బతీశాయి. ఇప్పటికే తుర్కియే నుంచి బంగ్లాదేశ్ సైన్యం వివిధ రకాల అత్యాధునిక ఆయుధాలను కొనుగోలు చేసింది. వీటిల్లో రాకెట్ డిఫెన్స్ సిస్టమ్స్, మైన్ రెసిస్టెంట్ వెహికల్, ఆర్మ్‌డ్ పర్సనల్ క్యారియర్స్ ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలిపోయాక ప్రధాని షేక్‌హసీనా భారత్‌కు రావడం, అనంతరం మొదలైన అల్లర్లలో హిందూ మైనార్టీలపై తీవ్రమైన దాడులు జరగడంతో ఇరు దేశాల సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే.

### తెలంగాణ తల్లి రూపంపై వీడిన సస్పెన్స్..

(మొదటి పేజీ తరువాయి)
చిత్రీకరించారు.తెలంగాణ సగటు మహిళను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ తల్లిని తీర్చిదిద్దినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ ఫైనాన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గంగాధర్ ఈ చిత్రానికి రూపకల్పన చేశారు. ప్రముఖ శిల్పి రమణారెడ్డి బృందం కాంస్య విగ్రహాన్ని తయారు చేసింది. 17 అడుగుల కాంస్య విగ్రహాన్ని సిద్ధం చేసింది. విగ్రహాన్ని ఇప్పటికే సచివాలయ ప్రాంగణానికి తరలించారు. విగ్రహం ఎత్తు 17 అడుగులు కాగా.. కింద గద్దె మరో 3 అడుగులతో రూపొందించారు.

## రాహుల్, రేవంత్‌వి బూటకపు హామీలు



(మొదటి పేజీ తరువాయి)
ఏమైయ్యాయని కాంగ్రెస్ పార్టీ నాయకులను గట్టిగా ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన తెలంగాణ జాగృతి నాయకులతో శుక్రవారం తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ యువ వికాసం కింద రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని, విద్య జ్యోతుల పథకం కింద ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ యువతకు రూ 5 లక్షలు ఇస్తామని చెప్పి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వాటి ప్రస్తావనే చేయకపోవడం శోచనీయమని విమర్శించారు. అలాగే, రూ 3 లక్షల లోపు ఆదాయం ఉన్న బీసీలకు 100 శాతం ఫీజు రియింబర్స్ మెంట్ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ... కనీసం అసలు రియింబర్స్ మెంట్ మొత్తాన్నే ఇవ్వడం లేదని ఎండగట్టారు. ఫీజు రియింబర్స్ రాక అనేక మంది ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న నియామక లెక్కల్లో అనేక వాటికి బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే పరీక్షలు జరిగాయని గుర్తు చేశారు. మహిళలకు నెలకు రూ. 2500 ఎప్పటి నుంచి చెల్లిస్తారో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లీటర్ పెట్రోలు రూ. 40 కే ఇస్తామన్న హామీ ఎప్పుడు అమలు చేస్తారని అడిగారు. విద్యార్థినులకు స్కూటి ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీయాలని ఆమె సూచించారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు..డ్రామా కంపెనీలు



- ఏడాది లో ఏమి సాధించారు అని ప్రజలు అడుగుతున్నారు
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- సరూర్ నగర్ లో బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

విశ్వంభర, రంగారెడ్డి బ్యూరో/ ఎల్బీనగర్ : కాంగ్రెస్, బీఆర్ఎస్ లు డ్రామా కంపెనీలు అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణలో ఆ రెండు పార్టీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ఈ ఎన్నికల్లో తాము ఇంకాస్త సర్దుకుని ఉండి ఉంటే బీజేపీకి మరో నాలుగు సీట్లు వచ్చేవని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలపై సరూర్ నగర్ లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈటల శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..తాము ప్రధాని మోడీ వద్దకు వెళ్లి రాష్ట్రానికి ప్రాజెక్టులు ఎలా తీసుకురావాలి. ఎలా బాగుచేసుకోవాలని ప్రయత్నిస్తుంటే సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతున్న తీరు ఏంటని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన అజ్ఞానానికి, అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. కిషన్ రెడ్డి సూసైడ్ చేసుకున్నా మూసీ ఆగదని అటున్నావంటే రేవంత్ నీకు ఏం అవగాహన ఉన్నట్లు నువ్వేం మనిషివి అంటూ మండిపడ్డారు. సీఎంకు ఇంత అహంకారమా? ఎక్కడిదీ సంస్కృతి, కిషన్ రెడ్డి చరిత్ర ఏంది? నీ చరిత్ర ఏంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలంలోనే ప్రజల మద్దతు.. విశ్వాసం కోల్పోయిందన్నారు. ఏం సాధించాడని రేవంత్ రెడ్డి సంబరాలు చేసుకుంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికి స్థాయిని మరిచి చిల్లర బాషా వాడుతున్నాడు అని మండిపడ్డారు. ఈ దఫా తెలంగాణ గడ్డపై నూటికి శాతం జెండా ఎగురబోతున్నదని రాష్ట్ర నేతలతో ప్రధాని మోడీ చెప్పారని ఈటల గుర్తు చేశారు. రేపటి సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు,శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే రేపటి ఆటోడ్రైవర్లబంద్కు బీజేపీ మద్దతు ఉంటుందని ఈటల చెప్పారు.

6 గ్యారెంటీలు..66 మోసాలు సభ విజయవంతం అయ్యేనా?

నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం తో ఎవరి దారి వారిదే

సామ రంగారెడ్డి మాట కార్పొరేటర్లు వినే పరిస్థితిలో లేరు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు సరిగా అమలు చేయలేదంటూ బీజేపీ నాయకత్వం ఆరు గ్యారెంటీలు 66 మోసాల పేరుతో సరూర్నగర్ స్టేడియంలో నిర్వహించే సభ విజయవంతం అవుతుందా అని బీజేపీ కార్యకర్తలే గుసగుసలాడుకుంటున్నారు. ఎల్బీనగర్ బిజెపి ఇన్చార్జి సామ రంగారెడ్డి కి కార్పొరేటర్ ల మధ్య సరిగా సఖ్యత లేదు అని స్పష్టమవుతుంది. శుక్రవారం ఉదయం గ్రౌండ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి ఎంపీ ఈటెల రాజేందర్ హాజరయ్యారు. ఈ సమావేశానికి సగానికి పైగా కార్పొరేటర్లు దుమ్మా కొట్టారు. జాతీయ అధ్యక్షుడు వచ్చే కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్లు దుమ్మా కొట్టడం స్థానికంగా చర్చనీ అంశం అయింది. దీంతో ఎల్బీనగర్ నియోజకవర్గం, ఆర్కే పురం, సరూర్నగర్ డివిజన్లో నుండి కార్యకర్తలను సభకు తరలిస్తారా అనే సందేహం అందరి మదిలో మేదులుతుంది. శనివారం జరిగే సభను ఎంతవరకు విజయవంతం చేస్తారు చూడాల్సిందే.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు ప్రేమేందర్ రెడ్డి, రామచంద్ర రావు, కార్పొరేటర్లు రాధా దిరజ్ రెడ్డి, పవన్ కుమార్, ఆకుల శ్రీవాణి, కోప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి, బద్ధం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులుగా కిరణ్ కుమార్

## అంబేద్కర్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకుల ఘన నివాళులు



**విశ్వంభర, ఎల్‌బీనగర్:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68 వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తా లో ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు , ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేపాక శంకర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షుడు, ఫౌండర్ బీఎన్ రమేష్ కుమార్ మాదిగ ముఖ్య అతిథిగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లేపాక కిరణ్ కుమార్‌ను ఎల్బీ నగర్ నియోజకవర్గ అధ్యక్షులుగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం పాటు పడతానని అన్నారు పవన్ సాయి హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్టు కృష్ణ మాదిగ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ తాండ్ర సంజీవ మాదిగ, రాష్ట్ర సెక్రటరీ పందిరి క్రాంతి కుమార్ మాదిగ ,రాష్ట్ర మాదిగ యువ సేన అధ్యక్షుడు సందీప్ కుమార్ మాదిగ ,ఎంఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బరపటి ఉపేందర్ మాదిగ ,డాక్టర్ మల్లేష్ తో పాటుగా మాదిగ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు కోదండరాం నివాళులు



**విశ్వంభర, హైదరాబాద్ :** భారత రాజ్యాంగ శిల్పి డా. బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రొఫెసర్ కోదండరాం నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టిఎస్‌జెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు రాంచందర్, సురేష్, రవికాంత్, పుష్ప తదితరులు పాల్గొని అంబేద్కర్ గారికి నివాళులు అర్పించారు.



నల్గొండ,సూర్యపేట జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ పర్యటించారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు చేరుకొని శనివారం సీఎం ప్రారంభించే పైలాన్ పనులను ప్రారంభించి అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు.అనంతరం ఎల్జీ కాలేజీ గ్రౌండ్ లో సీఎం సభ ఏర్పాట్లపై అధికారులతో రివ్యూ మీటింగ్ చేశారు.

- విశ్వంభర, నల్లగొండ

# సంధ్య థియేటర్ ఘటన బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం: అల్లు అర్జున్



**విశ్వంభర, హైదరాబాద్:** 'పుష్ప2' ప్రీమియర్ షో వేళ హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై ఆ సినిమా హీరో అల్లు అర్జున్ స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంటూ సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేశారు.'మేం 'పుష్ప 2' ప్రీమియర్ షోకి హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సంధ్య థియేటర్‌కు వెళ్లాం. అక్కడ జరిగిన తొక్కిసలాటలో కొందరికి దెబ్బలు తగిలాయని తెలిసింది. ఇద్దరు పిల్లల తల్లి రేవతి గారు చనిపోయారని తెలియగానే మా చిత్ర బృందం అంతా షాక్ కు గురయ్యాం. థియేటర్ కి వెళ్లి అభిమానులతో కలిసి సినిమా చూడటమనేది గత 20 ఏండ్లు నాకు ఆనవాయితీగా వస్తున్నది. ప్రేక్షకులకు వినోదాన్నిచ్చే సినిమా థియేటర్ వద్ద అలా జరగడం బాధగా ఉంది. రేవతి గారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.. ఎంత చేసినా ఆమె లేని లోటు తీర్చలేనిది. నా తరపున రూ.25 లక్షలు సాయం చేయాలని నిర్ణయించుకున్నా' అని ఆయన తన ఎక్స్ (మాజీ ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు.

### లగచర్ల దాడి కేసులో

# పోలీసు కస్టడీకి పట్నం నరేందర్‌రెడ్డి

## అనుమతిస్తూ కొండగల్ కోర్టు ఉత్తర్వులు జారీ



**విశ్వంభర, వికారాబాద్:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కొడంగల్ కోర్టు పోలీసు కస్టడీకి అనుమతించింది. లగచర్ల దాడి కేసులో ఏ1గా ఉన్న నరేందర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కొడంగల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నిందితుడిని రెండు రోజుల పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం పోలీసులు.. నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలు నుంచి వికారాబాద్ తరలించనున్నారు. రెండు రోజుల పాటు ప్రశ్నించనున్నారు.

# చక్రపాణికి ఘన నివాళులు



విశ్వంభర, హైదరాబాద్: వైస్రోప్ఇండియా మాజీ ప్రెసిడెంట్, వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ,అవోపా మాజీ ప్రెసిడెంట్ , ఎస్ఐఆర్సీ హై దరాబాద్ బ్రాంచ్ మాజీ చైర్మన్ చక్రపాణి బుధవారం ఆకస్మిక మృతిచెందారు. ఆయన మృతిపట్ల పలువురు ఆర్యవైశ్య నాయకులు సంతాపం తెలిపారు.






డా. బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని ఎల్బీనగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, జోగు రాములు, దాము మహేందర్ యాదవ్, ఇరుగు శ్రీధర్, కొదుమూరి దయాకర్ తదితరులు


- విశ్వంభర, ఎల్బీనగర్



కర్మణ్ ఘాట్‌లోని వంగ శంకమ్మగార్డెన్స్‌లో శుక్రవారం తెలంగాణ ఆవోపా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కందికొండ శ్రీనివాస్ మేన కోడలు జూనూరి మల్లిక వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, కందికొండ శ్రీనివాస్, శ్రీధర్, రమేశ్ తదితరులు


- విశ్వంభర, హైదరాబాద్






# 'వట్టికోట' మానవతకు పెట్టనికోట

## తెలంగాణ తొలి నవలాకారుడు ఆళ్వారుస్వామి




**తెలంగాణ వైతాళికులుగా పేరుగాంచి నిజాం నిరంకుశ ఏలికపై కలం, గళమెత్తిన వారిలో వట్టికోట ఆళ్వార్‌స్వామి ప్రముఖ గణనీయులు. వట్టికోట అంటే భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం వెలసిన`కోట`. ప్రాథమిక చదువుకే నోచని ఆయన స్వయం కృషితో ఆయా భాషలు నేర్చి కథకుడు, నవలాకారుడు, ఉపన్యాసకుడు, పత్రికా సంపాదకుడు, ప్రచురణ కర్త, గ్రంథాలయ నిర్వాహకుడిగా ఎదిగి బహుముఖీన పాత్రలు పోషించారు. `ప్రజల మనిషి`తో తెలంగాణ తొలి నవలా రచయితగా నిలిచారు. తెలంగాణ నవలా ప్రక్రియ చరిత్రలో సాయుధపోరాటం ఒక మలుపు. అది వట్టికోట ఆళ్వారు స్వామి వంటి ప్రజా రచయితను తెలంగాణ సాహిత్యానికి మాత్రమే కాకుండా తెలుగు సాహిత్యానికి ఇచ్చింది. తెలంగాణ లోని ఫ్యూడల్ వ్యవస్థ దౌష్ట్యం, నిజాం రాచరిక పాలనలో చిల్లరదేవుళ్ల అణచివేత ధోరణి లోకానికి విదితమే. ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన చారిత్రక ఉద్యమంపై నవలలు డజను దాకా ఉన్నాయి.. ఇందులో ప్రధానంగా ఎన్నదగింది వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి'. ఈ పోరాటం ఇతర ప్రాంతాల రచయితలకు స్ఫూర్తినిచ్చింది.**

### సమకాలీనత, యధార్ధ జీవన చిత్రణ ప్రధాన లక్షణాలు..

సమకాలీనత, యధార్ధ జీవన చిత్రణ, సమగ్రత నవలకు ప్రధాన లక్షణాలుగా చెబుతారు. సాధారణంగా కథ ఒక సంఘటన లేదా కొన్ని సంఘటనల మధ్య సంబంధాన్ని చిత్రిస్తే నవల జీవితాన్ని ఒడిసిపడుతుంది. ఆ కాలపు సామాజిక చరిత్రను రికార్డుచేస్తుంది. అలా చేసిన నవలలే తెలుగు సాహిత్యంలో నిలబడగలిగాయి. తెలంగాణ జనజీవితాన్ని అత్యంత వాస్తవిక దృక్పథంతో ఆవిష్కరించిన అతికొద్ది గొప్ప నవలల్లో వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు నవలలు పేరెన్నిక గన్నాయి . ప్రజల మనిషి నవల 1935 - 40 మధ్యకాలపు సామాజిక పరిస్థితులను చిత్రిస్తే గంగు నవల 1940-45 మధ్యకాలపు సామాజిక జీవన స్థితిగతులను ఆవిష్కరించింది. తెలంగాణ తొలి సామాజిక నవల ప్రజల మనిషి లో నిజామాబాద్ పరిసర ప్రాంతాలు ఆవిష్కృతం అవుతాయి. కాగా గంగు నవలలో నల్లగొండ పరిసరప్రాంతాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. ప్రజల మనిషి నవలలో దొరల దాష్టీకాలు, వెట్టిచాకిరి మత మార్పిడి ఇత్యాది అంశాలు చర్చకు రాగా, ఆంధ్ర మహాసభ ఆవిర్భావం... నిజాం వ్యతిరేక పోరాటాలు, వెట్టి చాకిరి నిర్మూలన ప్రజా చైతన్య ఉద్యమాలు గంగు నవలలో వస్తువు. గంగు నవలను రాజకీయ సామాజిక చారిత్రక నవలగా చెప్పవచ్చు. సామాన్యుడి గొడ్డు గోదా కూడా దొరలు బలవంతంగా లాక్కునే దౌర్జన్యకర పరిస్థితులు ప్రజల మనిషి నవలలో కనిపిస్తాయి. కథానాయకుడు కంఠీరవం తల్లిదండ్రులు రఘునాధాచార్యులు అండాలమ్మ జీవన విధానం వారి సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబాల జీవన శైలిని ప్రతిబించిస్తుంది. నాటి బ్రాహ్మణ కుటుంబాలలో పెళ్లిళ్లు, మర్యాదలు, సమాజంలో అంటరానితనం మొదలైన అంశాలు సందర్భానుసారంగా చర్చించారు. హరిజనోద్ధరణ, స్టేట్ కాంగ్రెస్ రాజకీయాలు రామ్ భూపాల్ రావు పాత్ర ద్వారా చక్కగా వివరించారు. ఆనాటి ప్రజల్లో దొరపై పెరుగుతున్న అసహనానికి ప్రతీక కొమురయ్య. దొర మేనలో బయలుదేరేటప్పుడు ఇద్దరు సేతు సిందీలు బాట ముందుగా బయలుదేరి ఎవరు కుండలతో ఎదురుకాకుండా, ఎవరు అరుగుల మీద కూర్చోకుండా చూస్తూ ఉండేవారు అని చెప్పడం నాడు దొరతనం పట్ల ప్రజలలో ఉన్న భయాన్ని ఏహ్యాభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. దొరలు ఎక్కువగా చదువుకోకపోయినా అశక్తులను అణచివేయడమే వాళ్ల గొప్పదనం అని రఘునాధచార్యులు అనడం దొరల దమననీతిని పట్టి చూపుతుంది. కొమురయ్య వేసేతోట ని దొర ఇతరులకు కౌలుకు ఇవ్వాలని చూడడం, కథానాయకుడు కంఠీరవం తో కొమురయ్య స్నేహం చేయడం, దొర పై వ్యతిరేక భావన పెంచుకోవడం ఆనాటి ప్రజల మనోస్థితిని ప్రతిఫలించే విధంగా ఉంది. పశు వుల కాపరులు అయిన పిల్లలు తెచ్చిన గురిగిలో కంఠీరవం నీళ్లు త్రాగడం నాటి నాయకుల సంస్కరణ భావాన్ని తెలియచెబుతుంది. దొర చేతిలో కీలుబొమ్మగా మారిన కంఠీరవం అన్న వెంకటాచారి తన రక్త సంబంధాలను సైతం వదులుకోవడానికి సిద్ధపడడం వారి పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించడం ఆనాటి సమాజం లోని కొంతమంది భయంతో, స్వార్థంతో సామాన్య జనాలను ఇబ్బందులకు గురి చేసిన వైనం స్ఫూర్రణకు వస్తుంది. కంఠీరవం ఇంటి నుంచి వెళ్లిపోయే సమయంలో అండాలమ్మ పడే వేదన ఆనాటి సామాన్యులైన తల్లులందరి వేదనగా భావించవచ్చు. రైలు లో టికెట్లు లేనందుకు దండ కడియం లాక్కోవడం ఆ నాటి పోలీసుల దౌర్జన్యాన్ని బట్టబయలు చేస్తోంది. ప్రజలను మత మార్పిడి, చేయడానికి ఉచిత వైద్యం ఉచిత విద్య ఎరగా వేయడం, సామాన్యులను బలవంతంగా మతమార్పిడి చేయడం వంటి సంఘటనలు అతిసాధారణం అని ప్రజలమనిషి ద్వారా తెలుస్తున్నది.

గ్రంథాలయాలు ప్రజలను చైతన్య పరిచిన విధానం మోహనాచార్యులు పాత్ర ద్వారా తెలియుచున్నది. గ్రంథాలయం ఆవరణలో జాతీయ నాయకుల ఫోటోలు నాటి యువతకు స్ఫూర్తిగా నిలిచాయి. ఆ ఫోటోలను చూసిన కంఠీరవం దేశకాల మాన పరిస్థితులను గురించి ఆలోచించడం అందుకు ఉదావారణ. నైజాం ప్రభుత్వ రాజకీయాలతో పాటు, తెల్లదొరల దాష్టీకాలను కూడా ప్రజల మనిషి నవల చర్చించింది. గుంటనక్క వంటి హైదర్ అలీ నాయకత్వంలో దొర కొమురయ్య భూములను ఆక్రమించుకోవడం, కొమరయ్య తల్లి అన్నమ్మ కూడా దొరకు ఎదురు తిరగడం, హైదర్ అలీ జీతగాడు అయిన కనకయ్యను కొట్టడం దొర జీతగాళ్లలోనూ దొర పట్ల ఒక వ్యతిరేక భావన పెరగడానికి కారణమైంది. నాటి తెలంగాణ అంతటా దాదావు అన్ని గ్రామాలలో అలాంటి పరిస్థితులే ఉండడం గమనార్హం. అణచివేత తీవ్రమైతే తిరుగుబాటు తప్పదని అన్నమ్మ పాత్ర నిరూపించింది. తన భూమిని ఆక్రమించుకోవద్దని దొరలను బ్రతిమాలడానికి వెళ్లిన కొమరయ్యను గుంజకు కట్టి వేసి కొరడాలతో కొట్టడం దొరల దౌర్జన్యానికి పరాకాష్ట. సీతమ్మ పాత్ర ద్వారా ఆనాటి సమాజంలో మనుషుల మధ్య ఉన్న మానవీయ విలువలు సాటి మనిషి దుఃఖం లో పాలుపంచుకోవడం మొదలైన అంశాలు దృశ్యమానం అవుతాయి. మత మార్పిడిని అడ్డుకున్న నేరానికి కంఠీరవంను కొమరయ్యను అరెస్టు చేయడం, న్యాయాధిపతులు, వకీలు, పోలీసులు కుమ్మక్కై ప్రభుత్వ చర్యలను నిరసించిన వారిని ఎటువంటి విచారణ లేకుండా రాజద్రోహం నేరం కింద జైలులో పెట్టడం ఆ కాలంలోని ఆటవిక న్యాయాన్ని ప్రతిఫలిస్తున్నది. తన అనుచరుడైన హైదర్ అలీ మత మార్పిడిని ప్రోత్సహిస్తున్నాడని అతన్ని తిరస్కరించి విజయ్ దేవ్ అనే ఆర్యసమాజ కార్యకర్తను చేరదీస్తాడు రామ్ భూపాల్ రావు, విజయ్ దేవ్ దొర చేస్తున్న అరాచకాలను, దోపిడీని గురించి ప్రశ్నించడంతో విజయ్ దేవ్ పట్ల కూడా కఠినంగా ప్రవర్తిస్తాడు. దొరల పెత్తనానికి అడ్డు వచ్చిన వాడు అనుచరుడైనా, ఆర్యసమాజీయుడైనా ఆగ్రహానికి గురికాక తప్పదని ఈ ఉదంతం స్పష్టం చేస్తున్నది.

నాటి సమాజంలో ప్రజలను చైతన్య పరచడానికి గ్రంథాలయాలు, భజన కార్యక్రమాలు, రాత్రి పాఠశాలలు ఇతోధికంగా వేదికలు అయ్యాయని తెలుస్తున్నది. కంఠీరవం నిజామాబాద్ జైలులో, హైదరాబాద్ జైలులో శిక్ష అనుభవి స్తున్నప్పుడు గ్రామ అధికారుల కుట్రలకు సామాన్య రైతులు ఎలా బలయిపోయారో తెలుసుకుంటాడు. నాటి సమాజ స్వరూపం, పరిపాలన యొక్క భయంకర దృశ్యము ఈ నవల ద్వారాబహిర్గతమవుతున్నది. దొంగతనం నేరంపై జైలుకు వచ్చిన బషీర్ కంఠీరవం బోధనలతో దేశభక్తుడుగా మారడం, జైలులో ఖైదీల హక్కుల కోసం కంఠీరవం పోరాటం చేయడం, అనాటి నాయకుల చిత్తశుద్ధిని ప్రకటిస్తున్నాయి. కులాల పేరిట అనైక్యత వల్లనే మనం ఇటువంటి అన్యాయాలకు బలి అవుతున్నామని, సమిష్టి బాధ్యత సమిష్టి జీవనం, సమిష్టి ఆలోచనలు లేకుండా పోతున్నాయని కంఠీరవం గ్రామ ప్రజలనుద్దేశించి మాట్లాడడం, సహపంక్తి భోజనాలు తదితర సంఘటనలు ఆనాటి సమాజాన్ని సంస్కరించడానికి చేసిన ప్రయత్నాలకు నిదర్శనాలుగా నిలుస్తాయి. వెంకటేశ్వరరావు అనే వకీలు ద్వారా రామ్ భూపాల్ రావు దౌర్జన్యాలను న్యాయస్థానంలో నిరూపించడం ద్వారా అతనికి అతని అనుచరుడు వెంకటాచారికి శిక్ష పడడం నవలలో కొసమెరుపు. వెంకటాచార్యులు స్వయాన కంఠీరవంకు సోదరుడు. తమ్ముడు తన వాడైనా ధర్మం తప్పకూడదు అన్న నీతిని రచయిత ఈ నవలలో చెప్పకనే చెప్పాడు. త్వరలోనే శిక్ష పూర్తి చేసుకొని వచ్చి, తిరిగి గ్రామంపై పెత్తనం చలాయించడం, గ్రంథాలయాన్ని మూతవేయడం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు కంఠీరవం మరియు అతని అనుచరులను తిరిగి నిర్బంధించడం తో ఈనవల ముగుస్తుంది.

నవలలో ఒక చోట బ్రాహ్మ ణుడు కంసాలి హరిజనుడు ఒకే బండిలో ప్రయాణించడం అనే సన్నివేశం ఉంది . ఇది చూసి ప్రజలు అందరూ ఆశ్చర్య పడతారు. ఈ సంఘటన ఆనాటి సమాజంలో అస్పృశ్యతా జాడ్యం ఏవిధంగా ఉందో తెలియ జేస్తుంది. గంగు నవలలో కథానాయకుడు నవనీతం. ఈ పాత్ర దేశనాయకుల త్యాగబుద్ధికి ప్రతీకగా నిలిచింది. దొరల ఇళ్లలో దాసి వాళ్లు అడ బాపలు ఎంతటి దయనీయమైన జీవితాన్ని గడిపారో అవగతం అవుతున్నది. కొరడా దెబ్బలు, బండపరుపు లాంటి శిక్షలు నాటి దొరల రాక్షస ప్రవృత్తిని తెలియజేస్తున్నాయి. సుజాత దొరబిడ్డ అయినప్పటికీ గాంధీ మార్గంలో నడుస్తూ దొరతనాన్ని వ్యతిరేకించే శక్తులతో కలిసి నడపడం నాటి సమాజంలో నూతన ఆలోచనా ధోరణికి దర్పణంగా నిలిచింది.

'కమ్యూనిస్టు పార్టీ అంటే మట్టిలో నుంచి మేలిమి బంగారం పుట్టిస్తుంది' అని నాగ భూషణం పాత్ర ద్వారా రచయిత పలికించడం నాటి కమ్యూనిస్టులపై ఉన్న ఆదరాభిమానాలను తెలియపరుస్తుంది. రైతులు కౌలుదారుల సమస్యలు, పెత్తందారుల దౌర్జన్యాలు, ప్రభుత్వ ఉద్యోగుల లంచగొండి విధానం, వెట్టి చాకిరి , లెవీ ధాన్యం విషయంలో జరుగుతున్న అవకతవకలు, వీటన్నిటినీ ఎదుర్కొని ప్రజలు సుఖంగా జీవించడానికి ఆంధ్ర మహాసభ ఇచ్చిన రాజకీయ చైతన్యం ఈ నవలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఈ విధంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యేవరకూ సుమారు రెండు దశాబ్దాల సాంఘిక చరిత్ర వట్టికోట ఆళ్వారుస్వామి నవలలో నిక్షిప్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న గంగు నవల పూర్తి చేసి ఉంటే మరింత సమగ్రత వచ్చి ఉండేది. వారి చరిత్రకు సజీవ సాక్ష్యం. తెలంగాణ నుండి గొప్ప నవలా సాహిత్యాన్ని సృజించిన వట్టికోట ఆళ్వార్ సదా చిరస్మరణీయుడు.

### తెలంగాణ సమాజానికి దర్పణంగా నిలిచిన ప్రజల మనిషి..

**నాటి తెలంగాణ సమాజానికి దర్పణంగా నిలిచిన నవల ప్రజల మనిషి. 1940 వ్యక్తిగత సత్యాగ్రహాలవరకూ ఈ నవలలో సాంఘిక ప్రజాజీవనం కనిపిస్తుంది. అనంతర కాలాన్ని రికార్డు చేసిన మరొక నవల గంగు, వట్టికోట ఆళ్వారు స్వామి ఆంధ్ర మహాసభ కార్యకర్తగా, కమ్యూనిస్టు కార్యకర్తగా మారిన అనంతరము పరిస్థితులు ఈ నవలలో కనిపిస్తాయి. జగ్గయ్య దొర చేసే అరాచకాలు, అందంగా కనిపించిన స్త్రీలపై అత్యాచారాలు వారి దొరస్వామ్యపు పైశాచికత్వాన్ని ప్రకటిస్తున్నాయి. కంసాలి నాగభూషణం దొరకు విధేయుడు అతని భార్య అంతమ్మపై దొర కన్నుపడడంతో గ్రామం వదలి రామన్నపేటకు వెళ్లిపోవడానికి సిద్ధపడతాడు. ఇది మనసులో ఉంచుకొని నాగభూషణం భూమి లాక్కోవడానికి ప్రయత్నం చేస్తాడు దొర. బలవంతంగా భూములు లాక్కోవడం, అమీన్, దొర కుమ్మక్కై ప్రజలను ఇబ్బందులపాలు చేయడం ఆనాడు నిత్యకృత్యం, తలుపు పెట్టి కొడితే పిల్లి కూడా తిరగబడుతుందనడానికి ఆ నాగభూషణం ఒక ఉదాహరణ. దొరకు ఎదురు తిరిగి ఆంధ్ర మహాసభ కార్యకర్తగా మారిపోతాడు కాంగ్రెస్ ముస్లింలీగ్ రాజకీయ వ్యవహారాలు కూడా నవలలో సందర్భానుసారంగా చర్చించబడ్డాయి. ఆనాటి పోలీసు అధికారి అమీన్ ఇంట్లో వెట్టి చాకిరి చేయడానికి నిరాకరించిన వాడిని దారుణంగా కొట్టడం వంటి సంఘటనలు వాడి అధికార దుర్నీతికి నిలుపుటద్దాలు.**

# సాయుధ దళాల సేవలు అనన్య సామాన్యం

## వారి దేశభక్తి వెలకట్టలేనిది

### నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం



ఎముకల కొరికే తీవ్ర చలిలో, కుండపోత వర్షాలైనా, భగ్గుమనే ఎండలతో పాటు ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా ఏమాత్రం ఆత్మస్థైర్యం చెక్కుచెదరని సైనికుల దేశభక్తికి ప్రతి ఒక్కళ్లూ దాసోహం కావాల్సిందే. ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించుకుంటాం. సాయుధ దళాల పతాక దినోత్సవం భారత సాయుధ దళాల సిబ్బంది యొక్క శౌర్యం, త్యాగం మరియు అచంచలమైన నిబద్ధతకు ముఖ్యమైన గుర్తుగా నిలుస్తుంది. ఈ రోజు దేశ సమగ్రతను కాపాడే యూనిఫాంలో ఉన్న స్త్రీ పురుషుల పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ దేశ వ్యాప్తంగా ఉన్న పౌరుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. దేశ రక్షణ కోసం సాయుధ దళాలు అహర్నిశలు చేస్తున్న కృషి, శత్రువుల నుంచి దేశాన్ని రక్షిస్తూ వారు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాలకు అండగా ఉన్నామని తెలియజేయడమే దీని ప్రత్యేకత. 1949లో రక్షణ మంత్రి కమిటీ పతాక దినోత్సవం డిసెంబరు 7న జరుపుకోవాలని నిర్ణయించారు.

దేశ రక్షణతోపాటు అంతర్గతంగా జరిగే అనేక విపత్కర పరిస్థితులను చక్కదిద్దడంలో ఆర్మీ, వైమానిక, నౌకా దళం కీలక పాత్ర పోషిస్తుంటాయి. ప్రజల ధన, మాన ప్రాణాలను రక్షించడంలో సాయుధ ధళాలు ముందువరసలో ఉంటాయి. రాష్ట్రాలలో సంభవించిన వరదలు, భూకంపాల సమయంలో వేలాది మందిని తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సురక్షిత ప్రాంతాలకు సైనికులు చేర్చుతుంటారు. పలుచోట్ల జరిగిన ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టి ప్రజలను రక్షిస్తూ వీరమరణం పొందిన విషయం కూడా మనందరికీ తెలుసు. త్రివిధ దళాల ప్రాతినిధ్యం వహించే ఎరుపు, ముదరు నీలం, లేత నీలం రంగుల జెండాలను కేంద్రీయ సైనిక్ బోర్డు, రాజ్యసభ, జిల్లా సైనిక్ బోర్డ్ ద్వారా ప్రజలకు పంపిణీ చేసి విరాళాలు సేకరిస్తారు. దేశం కోసం పోరాడే సైనికుల కుటుంబాలు, వారిపై ఆధారపడి జీవించేవారి పరిరక్షణ గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత సాధారణ ప్రజకు ఉందనే ఉద్దేశంతో విరాళాలు సేకరించడం ఫ్లాగ్ డేకు అత్యధిక ప్రాధాన్యత లభించింది.

యుద్ధంలో గాయపడినవారికి పునరావాసం కల్పించడం, సర్వీసులో సిబ్బంది, వారి కుటుంబీకుల సంక్షేమం, మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం, పునరావసం కల్పించడం. అమరవీరుల కుటుంబాలు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సైనిక సంక్షేమ శాఖ స్థాపించారు. ఈ శాఖ రాష్ట్రంలో హోం శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించే అన్ని రాయితీలను వారికి సక్రమంగా చేర్చడానికి ఈ శాఖ ప్రత్యేకంగా కృషిచేస్తుంది.భారత సైనిక భద్రతా దళాల్లో భారత సైనికదళం, భారత నౌకాదళం, భారత వైమానికదళం ఉన్నాయి. 14 లక్షలకు పైబడిన సైన్యంతో ప్రపంచంలోని మూడో అతి పెద్ద సైన్యం కలిగిన దేశంగా భారత్ గుర్తింపు పొందింది. భారత రక్షణ దళాలన్నింటికి సర్వసైన్యాధక్షుడుగా భారత రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ప్రధానమైన ఈ మూడు రక్షణ దళాలతోపాటు తీర రక్షక దళం, పారామిలటరీ దళాలు కూడా వీటిలో అంతర్భాగాలే. భారత సాయుధ దళాలు అనేక సైనిక చర్యల్లో 1947, 1965, 1971 సంవత్సరాల్లో పాల్గొన్నాయి. అందులో 1963లో చైనా యుద్ధం, పోర్చుగీసు యుద్ధం, 1987లో చైనా ఘర్షణ, కార్గిల్ యుద్ధం, సీయాచిన్ ఘర్షణలో పాల్గొన్నాయి. 2014లో ప్రపంచంలో అత్యధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకున్న దేశాలలో భారతదేశం అగ్రస్థానంలో నిలిచింది.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన షానూర్



**విశ్వంభర, రామన్నపేట:** హైదరాబాద్ మల్లాపూర్ వి.ఎన్.ఆర్ గార్డెన్లో శుక్రవారం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు కుమార్తె వివాహా మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖాజా ఫసియొద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాస్, రామన్నపేట మండలం నుండి దేవిరెడ్డి సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల రిసెప్షన్‌కు ఆహ్వానం



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో ఈనెల డిసెంబర్ 8 న ఉప్పల వెంకటేష్ చిన్న కుమారుడు పెళ్లి రిసెప్షన్ ని ఏర్పాటు చేస్తున్నారు. ఆయన శుక్రవారం ఖానాపూర్ గ్రామంలోని మహిళలకు రిసెప్షన్ కు తప్పకుండా రావాలని తమ కుటుంబ సభ్యులతో కలిసి చీరలను అందజేశారు. అలాగే అఖిల్ కూడా మహిళలకు చీరలను అందజేసి బొట్టు పెట్టి, తమ్ముడి రిసెప్షన్ కు గ్రామస్తులను ఆహ్వానించారు.

## అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన సంక్షేమ అధికారి



**విశ్వంభర, భూపాలపల్లి :** జిల్లాలోని చిట్యాల అంగన్‌వాడి కేంద్రాన్ని సంక్షేమ అధికారి చిన్నయ్య సందర్శించారు. చిన్నారులతో స్నేహపూర్వక సమయం గడిపారు. చిన్నారులతో కలిసి భోజనం చేస్తూ, వారి ఆరోగ్యం, పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడి కేంద్రంలో సౌకర్యాలు, చిన్నారులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి, అందించిన సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల ఆరోగ్యం, వారి మౌలిక అవసరాలపై మరింత శ్రద్ధ చూపాలని సూచనలు ఇచ్చారు. ఈ సందర్శనలో అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు

## ఆలయంలో ప్రజా పాలన విశేష పూజలు



**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సంకల్పిస్తూ భూపాలపల్లి జిల్లా లోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయంలో ప్రధానార్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు శ్రీ శుభానంద అమ్మవారికి విశేష పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది మరియు కాళేశ్వరం గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన ఎమ్మెల్యే వీరేశం

**విశ్వంభర, రామన్నపేట:** లక్ష్మాపురం గ్రామానికి చెందిన మెండే మల్లయ్య, అండాలు దంపతుల ఏకైక కుమార్తె వివాహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై, నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బోల్ల వెంకట్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొర్ల నరసింహ, యువ నాయకులు బత్తుల నవీన్ కుమార్, దిండు బాలు, శివ తదితరులు పాల్గొన్నారు.



### ప్రజాపాలన ఉత్సవాలు కాదు..

# ఉద్యమకారులకు ప్రత్యేక ప్యాకేజి బిల్లు పెట్టండి

**- భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)**




**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్రం రావడానికి 2000 సంవత్సరం నుండి 2014 వరకు పల్లె నుండి పట్టణాల వరకు తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, యువకులు, మేధావులు, కళాకారులు, మహిళలు, రైతులు, అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులను గుర్తించలేదు, రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో ఉద్యమకారులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, అంచలవారిగా ఉద్యమకారులను ఆదుకోవాలని సిపీఇ జిల్లా నాయకులు, మలిదశ ఉద్యమకారులు రెబ్బాస్ రాములు కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన అనంతరం తెలంగాణలో పోరాటం చేసిన ఉద్యమకారులు అనేక విధాలుగా రాస్తారోకోలు, రైలు రోకోలు, సడక్ బందులు మానవహారం, మిలియన్ మార్చ్, రాత్రి అనక పగలనక తన కుటుంబాలను పక్కనపెట్టి ఉద్యమాలు చేసి పోలీసుల లాఠీ దెబ్బలు తిని జైలు జీవితం గడిపి, కోర్టుల చుట్టూ తిరుగుతూ, ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఇతర రాష్ట్రాలకు వలసలు పోయి కార్ఖానాలలో కార్మికులుగా, లారీల క్లీనర్లుగా చాలీచాలని జీతంతో జీవితం గడుపుతున్నారు. అందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రభుత్వంలో కొనసాగుతూ ఇలాంటి ఉద్యమకారులను గుర్తించకుండా ఉద్యమ ద్రోహులకు తమ కుటుంబాల స్వలాభం కోసం పెద్దపీట వేసినది. ఉద్యమకారులను గుర్తించమని బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదు, అదే ఆలోచనలను 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎజెండాలో ఉద్యమకారులను గుర్తిస్తామని వారికి గుర్తింపు కార్డులు ఇస్తామని, 250 గజాల ఇంటి స్థలం ఇస్థామని, వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, అంచలవారిగా వారిని అభివృద్ధి చేస్తామని ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక బహిరంగ సభలలో ఉపన్యాసాలు ఇవ్వడం జరిగినది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాడు. తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ చీమ శ్రీనివాస్ ద్వారా తెలంగాణ ప్రభుత్వ మంత్రివర్గానికి విన్నవించారు. ఇలాంటి విషయాన్ని ఏ మంత్రివర్గంలో గాని ప్రభుత్వం ఏర్పడి 12 నెలలు కావస్తున్నా ఎక్కడా ప్రస్తావన రాలేదు. తెలంగాణలో ప్రతి నియోజకవర్గంలో ఉద్యమకారులు ఓట్లు వేసి గెలిపించిన ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఉద్యమకారులను వారి గురించి ఎక్కడా ప్రస్తావన తీసుకురాలేదు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటి అమలు కాలేదు. అదే కాకుండా ఇప్పటివరకు తెలంగాణ గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి నిధులు కూడా చేపట్టలేదు ఇవన్నీ చేసిన తర్వాతనే తెలంగాణలో ఉత్సవాలు జరిపితే బావుంటుందని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రతి ఒక్కటి నెరవేర్చాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తుంది.

## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

**- మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, అనురాధ**



**విశ్వంభర, కడ్తాల్:** అధికారం చేతిలో ఉందని చీటికిమాటికి బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని, అప్రజాస్వామికమని కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధ పత్య నాయక్ లు అన్నారు. రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాల పైన కాకుండా పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి పోలీసులతో పాలనను కొనసాగిస్తున్నారని ఫైరయ్యారు. ముందుగా ముఖ్యమంత్రి మా ప్రాంతమయినందుకు గర్వపడ్డామని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మా ప్రాంత ముఖ్యమంత్రి ని తిడుతుంటే సిగ్గుపడుతున్నామని తెలిపారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలోనే తనను 11 సార్లు అరెస్టు చేశారని దశరథ్ నాయక్ మండిపడ్డారు. గొప్పలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, తులసి రామ్, శ్వేతాబునాథ్ మాజీ ఎంపీటీసీ గోపాల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, గుత్తి బాలస్వామి, చుక్క నిరంజన్ గౌడ్, సేవ్య నాయక్, నరసింహ, పాండు, అంజి, కృష్ణ, శ్రీను, రమేష్, హెచ్ఆర్ మహేష్, మాదారం మహేష్, మల్లేష్, సురేష్, నాగార్జున, రాజు, భీమన్, శ్రీకాంత్ తదితరులు వున్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ మండిపాటు



**విశ్వంభర, ఆమనగల్లు:** కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తయిన గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని పైగా విజయోత్సవాలు నిర్వహించడం ఏమిటని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆమనగల్లు మాజీ జడ్పిటిసి కండే హరి ప్రసాద్ అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై కరపత్రం విడుదల చేశారు. నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 8న కల్వకుర్తి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని అధిక సంఖ్యలో కార్యకర్తలు బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య నియోజకవర్గ కన్వీనర్ గోరటి నరసింహ, మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీకాంత్ సింగ్, కౌన్సిలర్లు విజయ్ కృష్ణ, లక్ష్మణ్, చెన్నకేశవలు, బిజెపి నాయకులు ముక్తాల వెంకటయ్య, మహేష్, శీను, తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరి రాజారత్నం జన్మదిన వేడుకలు

**విశ్వంభర, వరంగల్:** అట్టహాసంగా సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కొల్లూరి రాజారత్నం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కొల్లూరి రాజరత్నం మాట్లాడుతూ నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. రానున్న 2025 కొత్త సంవత్సరంలో మన సురక్ష ఇన్ డెవలపర్స్ సభ్యులందరూ సుఖ సంతోషాలతో ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మర్రి వెంకటేశ్వర్లు, వెంకటేష్,మహమ్మద్ అలీ ఆరోగ్యం,గోపి,డికెన్ రాసకట్ల శ్రీనివాస్, చిదురాల సత్యనారాయణ ఇమ్మడి ఎలిషా,రమా, సులోచన సుభద్ర, స్రవంతి,దివ్య శిరీష,అడ్మిన్ స్టాఫ్ సారిక విక్రమ్,సౌజన్య,సతీష్ ఇంగే మహేందర్,సురక్ష ఇన్ఫ్రా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




### విద్యార్థులకు సైబర్ నేరాలపై

## అవగాహన సదస్సు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సతీష్ అవగాహన కల్పించారు. శుక్రవారం పెద్ద శంకరంపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల జరుగుతున్న మోసాలపై ఆయన అవగాహన కల్పించారు.

డ్రగ్స్ వినియోగం, షీ టీం పనితీరు గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. వికలాంగ విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆయన పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, పీజీహెచ్ఎం రాజేశ్వర్, కాంప్లెక్స్ హెచ్ఎం విట్టల్, ఎస్ఆర్పి ప్రసన్న, ఎంఐఎస్ సి సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పశు పోషణలో

## జాగ్రత్తలు తీసుకోవాలి

**పేట మండల పశు వైద్యాధికారి నాగార్జున పాటిల్**

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పాడి రైతులు తమ పశువుల పెంపకంలో పోషణ జాగ్రత్తలు తీసుకోవాలని పెద్ద శంకరంపేట మండల పశు వైద్యాధికారి నాగార్జున పాటిల్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని విరోచపల్లిలో జిల్లా పశుసంవర్ధక శాఖ సహకారంతో గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు పశుపోషణ పై అవగాహన కల్పించడంతోపాటు పాడి పశువులు సకాలంలో ఎదకు వచ్చేలా చూడాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి గోపాలమిత్ర జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం గౌడ్. మహేశ్వర్ రెడ్డి పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర శిక్షణ ఉద్యోగులు నిరాహార దీక్షలు




**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టారు. ఉద్యోగులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేసారు. జిల్లా అధ్యక్షులు మహంకాళి వీరన్నతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక నెలలో మా సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. ఏడాది కాలం గడుస్తున్నా సమస్యను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జానకి రాముడు, ఖాదర్ ,వివిధ విభాగాల నుంచి జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్, బాబులల్, సుధాకర్, అనిల్, యాకన్న, డిపిఓ సిబ్బంది నదీం, హసీనా ,బిందూ, రమేష్ ,రాజశ్రీ, ప్రభావతి, లక్ష్మి,నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## టిజేఎస్ పార్టీలో చేరికలు




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, పల్లివాడకు చెందిన గడ్డం యాదగిరి తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టిజేఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేశపాక శ్రీనివాస్, టి.జే.ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నకిరెకంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### యాదాద్రి థర్మల్ ప్లాంట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను

## పరిశీలించిన మంత్రులు



**విశ్వంభర, నల్గొండ :** దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్లాంట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. మంత్రులకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. సంబంధిత శాఖల అధికారులకు మంత్రులు తగిన సూచనలు చేసారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఒక సంవత్సర పరిపాలన పూర్తి చేసుకున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రజలందరూ విజయోత్సవాలు చేసుకుంటున్నారు అని అన్నారు. సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయమనే నినాదంతో ముందుకు కొనసాగుతున్నాం . కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంగా డెవలప్మెంట్ వెల్ఫేర్ ఇంక్లూజివ్ లో సోషల్ జస్టిస్ మా మూల సిద్ధాంతాలు దీని ప్రకారమే ఒక సంవత్సర పరిపాలన కొనసాగింది అని అన్నారు. అదే పద్ధతిలో మరో నాలుగు సంవత్సరాల పరిపాలన కొనసాగించబోతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత

# బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళులు



ఎల్‌బీనగర్ : ఫరీద్పూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామ మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య గౌడు తదితరులు

ఎల్బీనగర్: బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు





హైదరాబాద్ : హైదరాబాద్ సీసీఎస్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ మనోహర్‌తోపాటు సామాజిక కార్యకర్త చేపూరి శంకర్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న కొంగరి నరసింహ, ఆడాల రమేష్ ,జోగు రాములు, ఏట సత్యనారాయణ ,శ్రీధర్, బిక్షాపతి, రవీందర్

విశ్వంభర, న్యూస్ : రాజ్యాంగనిర్మాత భారతరత్న పెదవర్గాల బాంధవుడు డా. బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా వాడవాడలా, ప్రభుత్వ, ప్రైవేట్, పార్టీ, వివిధ సంఘాల కార్యాలయాల్లో.. విద్యాసంస్థల్లో అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు. అంబేద్కర్ రాజ్యాంగం రాయడంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎంతో శ్రమించారన్నారు. రిజర్వు బ్యాంక్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి దేశ స్థిరమైన ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులు వేశారని గుర్తు చేశారు. అలాగే అనేక ఉద్యమాలు చేసి సామాజిక న్యాయం అలుపెరుగని పోరాటం చేశారు. ముఖ్యంగా మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడిన బహుముఖ ప్రజ్ఞశాలి అని ప్రశంసించారు. అనగారిన బీసీ.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాధికారం దక్కినప్పుడు మాత్రమే డాక్టర్ అంబేద్కర్‌కి మన మందరం ఋణం చెల్లించుకోవడం అవుతుంది. ఈ దేశ ప్రజలందరికి పడ్డ బానిస సంకెళ్ళను తన జ్ఞాన ఖడ్గంతో విముక్తి చేసిన గొప్ప మహనీయులు డాక్టర్ అంబేద్కర్ అన్నారు.



కోరుట్ల : జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్, ఆర్డీఓ జివాకర్ రెడ్డి, తహసిల్దార్ ఇట్యాల కిషన్, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, కోరుట్ల సీఐ సురేష్ బాబు, కౌన్సిలర్లు మోర్తాడు లక్ష్మీనారాయణ, బలిజ పద్మా రాజారెడ్డి తదితరులు



మీర్‌పేట్: మీర్ పేట పరిధిలో వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్ గౌడ్ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి

ఎల్‌బీనగర్ : ఎల్బీ నగర్‌లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు





మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి అంబేద్కర్ పార్కులో నివాళులర్పిస్తున్న మెట్‌పల్లి డి.ఎస్.పి రాములు, మున్సిపల్ కమిషనర్ టీ మోహన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కూన గోవర్ధన్ తదితరులు



బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ గౌతమ్ నగర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫెడరేషన్ చైర్మన్, రాష్ట్ర నాయకులు రాపోలు రాములు, 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల అనిత యాదగిరి, 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ తదితరులు



చారకొండ: నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న పార్టీ మండల అధ్యక్షులు చారకొండ చంద్రశేఖర్ మహారాజు తదితర నాయకులు



భూపాలపల్లి : జయశంకర్ జిల్లా భూపాలపల్లి మహాదేవపూర్ మండలం సూరారం చౌరస్తా అంబేద్కర్ కూడలి వద్ద తూడిచెర్ల దుర్గయ్య



మహబూబాబాద్ : అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సీనియర్ న్యాయవాది, న్యాయవాద పరిషత్ జిల్లా కన్వీనర్ తుంపిళ్ల శ్రీనివాస్ , జిల్లా సహ కన్వీనర్ నలుసాని ప్రభాకర్ రెడ్డి



చేవెళ్ల : శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఆమనగల్లు: ఆమనగల్లు మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేష్, గౌరవాధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి ఏనుముల రమేష్ తదితరులు



సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో..



షాద్‌నగర్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య



నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి తక్కల్లపల్లి రవీందర్ రావు తదితరులు



కడ్తాల్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు



షాద్‌నగర్ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య ఆధ్వర్యంలో..



చింతపల్లి : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




సూర్యాపేట : తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ (టీజేఏ) సూర్యాపేట జిల్లా అధ్యక్షులు షేక్ సైదా ఆధ్వర్యంలో హుజూర్ నగర్ నియోకవర్గ కేంద్రం లోని టీజేఏ ప్రెస్‌క్లబ్‌లో నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు నవాబ్ జాని, బయ్యారపు రవీంద్ర, నందిగామ నాగేందర్, కొత్తపల్లి మధు, కొల్లోజు నాగేంద్రా చారి, కొత్తపల్లి కుమార్ తదితరులు

భూపాలపల్లి : భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తదితరలు



వరంగల్ : 65వ డివిజన్ ఎల్లాపూర్‌లో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎల్లాపూర్ అంబేద్కర్ యువజన సంఘం





త్రిపురారం : త్రిపురారంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ గాజుల ప్రమీల తదితరులు

## పదవ తరగతి విద్యార్థిని మిస్సింగ్



**విశ్వంభర, మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని విస్డమ్ హై స్కూల్ లో 10 తరగతి చదువుతున్న చింతల అక్షర విస్డమ్ హై స్కూల్ హాస్టల్ లో ఉండి 10తరగతి చదువుకుంటుంది. ఈనెల 5న స్కూల్ నుండి మధ్యాహ్నం బయటకు వెళ్లిన అమ్మాయి తిరిగి స్కూల్ కు రాలేదని సమాచారం ఇవ్వడంతో అక్షర తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేస్ నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెట్టు మహేందర్ రెడ్డి నూతన గృహప్రవేశం మహోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, పల్సర్ భిక్షం, యాదయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



**విశ్వంభర, రామన్నపేట:** మండల కేంద్రానికి చెందిన బి.ఉమామహేశ్వరి, జి. నరసింహ లకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ జమీరొద్దీన్, నాయకులు ఎండి అక్రమ్, కోట సుధాకర్, గొలుసుల ప్రసాద్, కొమ్మ శేఖర్, గురుకు శివ, మోటే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి కూతురుకు పట్టుచీరతో పాటు ఆర్థిక సాయం



**విశ్వంభర, కడ్తాల్:** పేదింటి ఆడపడుచు వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ కడ్తాల్ మండలంలోని రావిచెడు గ్రామపంచాయతీ మద్దెలకుంట తండాకు చెందిన కాట్రావత్ దేవిదాస్య దంపతుల కుమార్తె శోభ వివాహానికి ట్రస్ట్ పట్టుచీరతోపాటు 21 వేల రూపాయలను ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అందజేశారు అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఉపసర్పంచ్ శారద పాండు 11 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోపాల్ వసంత, మాజీ సర్పంచ్ లక్ష్మీ కస్నా, బాలకృష్ణ, పవన్ కుమార్ మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం మహాదానం: డా. ముస్తఫా





**విశ్వంభర, సికింద్రాబాద్ :** రక్త దానం మహాదానం అని షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముస్తఫా అన్నారు. శుక్రవారం బొల్లారం లోని కే ఎల్ హై టెక్ సెక్యూర్ ప్రింట్ లిమిటెడ్ కంపెనీ లో రక్త దాన శిబిరం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ లో నీ ఉద్యోగులు రక్త దానం చేయడానికి ముందుకు వచ్చారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక మరణాలు సంభవిస్తున్నాయి అని అన్నారు. రక్తం ఇవ్వడం వల్ల ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి డా.ముస్తఫా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పీ.విజయ తదితరులు పాల్గొన్నారు.

## 7, 8 తేదీలలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలో డిసెంబర్ 7, 8వ తేదీ లలో ఎస్సిఆర్టి ఆదేశానుసారంగా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ తెలిపారు . ఈ సైన్స్ ఫెయిర్ లో 300 సైన్స్ ఎగ్జిబిట్స్ 57 ఇన్స్పైర్ ప్రదర్శనలు ప్రదర్శించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్పర్సన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి హాజరు అవుతారని అని తెలిపారు.

# చెప్పులు అరిగేలా తిరిగినా పనికాకనే రాజీనామా చేశా..

- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో కసిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- ఎవడబ్బ సొమ్మని 94 వేల కోట్లు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు
- సింపతీ కోసం బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



విశ్వంభర, తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలు మండల మహిళా సమాఖ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై వివిధ బ్యాంకుల ద్వారా మండలంలోని 70 మహిళా సంఘాలకు మంజూరైన 9 కోట్ల 30 లక్షల 50 వేల రూపాయల చెక్కును పొదుపు సంఘాలకు అందజేశారు. మంజూరైన నిధులను పొదుపు సంఘాలు దుర్వినియోగం చేయకుండా వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హరీష్‌రావు కౌశిక్ రెడ్డి అరెస్టులు, ధర్నాలు అంటూ సింపతి కొరకు పాకులాడు తున్నారని, బీఆర్ఎస్ నాయకులను ప్రజలు నమ్మరని మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణను పదేళ్ల కాలంలో ఏడు లక్షల కోట్ల అప్పుచేసి అప్పుల తెలంగాణగా మార్చారని, 94 వేల కోట్ల రూపాయలతో కాళేశ్వరాన్ని నిర్మిస్తే ఆ ప్రాజెక్టు పనికి రాకుండా పోయిందని ఎవడబ్బ సొమ్మని కేసీఆర్ దుర్వినియోగం చేశారని ప్రజలకు చెప్పాలని విరుచుకుపడ్డారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని భూ నిర్వాసితులకు గత ప్రభుత్వంలో డబ్బులు రాక నాకు మొరపెట్టుకుంటే నేను చెప్పులు అరిగేలా కేసీఆర్ చుట్టూ, మంత్రుల చుట్టూ తిరిగానని అయినా డబ్బులు రాలేదని, అందుకే బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరానని, ఎవరో చెబితే ఎవరో టికెట్ ఇప్పిస్తే రాలేదని అన్నారు. అదేవిధంగా నియోజక వర్గంలో 125 కోట్లతో తలకొండపల్లిలో రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయిందని అన్ని వర్గాల విద్యార్థులు ఒకటే బెంచ్ లో కూర్చుని చదువుకోవాలన్నదే తమ తాపత్రమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, ఏ ఎం సీ ఛైర్మన్ గీత నరసింహ, డైరెక్టర్లు అంజయ్య, గుప్తా అజీమ్, వెల్జాల్ అజీజ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణపై గీతంలో అంతర్జాతీయ సదస్సు




**విశ్వంభర, సంగారెడ్డి:** గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు సమాయత్తమవుతోంది.'ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ లో సమీకృత పోకడలు' అనే అంశంపై ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు, మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సదస్సు నిర్వాహకులు డాక్టర్ ప్రతీక్ పాఠక్, డాక్టర్ ఆశిష్ ఆర్ ద్వివేది శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుంచి గౌరవనీయమైన విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఫార్మాస్యూటికల్, కెమికల్, బయోలాజికల్, హెల్త్ సైన్సెస్ లలో సమగ్ర పరిశోధనా పోకడల తాజా పురోగతులపై చర్చించనున్నట్టు తెలియజేశారు. ఆయా ప్రముఖుల వినూత్న ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి ఒక వేదికను రూపొందించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. సహజ, ఆరోగ్య శాస్త్రాలలో సమకాలీన పురోగతులు, సవాళ్లపై అమూల్యమైన అవగాహనను కల్పించడమే గాక, ఈ సదస్సులో ప్లీనరీ సెషన్ లు, కీలక ప్రసంగాలు, విశిష్ట నిపుణులతో చర్చలు ఉంటాయన్నారు.ప్రముఖ అంతర్జాతీయ వక్తలు అమెరికా (కాలిఫోర్నియా)లోని చాప్మన్ విశ్వవిద్యాలయం ఫార్మసీ ప్రొఫెసర్ కీకావన్ పరంగ్, శ్రీలంకలోని వయాంబ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ ఎస్. జీవతయాపరన్, సింగపూర్ లోని నాన్యాంగ్ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గావో యోంగ్గుయ్, మలేషియా లోని అంతర్జాతీయ వైద్య విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ త్యాగరాజన్ మాధేశ్వరన్, అమెరికాలోని సైటోమ్ఎక్స్ థెరప్యూటిక్స్ కు చెందిన డాక్టర్ రాఘవ శ్రీరామనేని, క్రోయేషియాలోని రూడర్ బోస్కావిక్ ఇన్స్టిట్యూట్, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్యూటింగ్ సెంటర్ కు చెందిన డాక్టర్ జురికా నోవాక్, దక్షిణ కొరియా చుంగ్ ఆంగ్ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ గంగరాజు గెడ్డ తదితరులు పాల్గొని, తమ నైపుణ్యాలను సదస్యులతో పంచుకుంటారని వివరించారు.యువ శాస్త్రవేత్తలు తమ పరిశోనలను ప్రదర్శించడానికి, గుర్తింపు పొందేందుకు, ఉత్తమ పోస్టర్, బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్, గౌరవనీయమైన యంగ్ సైంటిస్ట్ అవార్డులతో సహా ప్రతిష్టాత్మక అవార్డుల కోసం పోటీపడేందుకు కూడా ఈ సమావేశం ఒక అద్భుత అవకాశంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ లో సమగ్ర ధోరణులపై పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నామని, ఎంపిక చేసిన పత్రాలను స్కోపస్ఇండెక్స్డ్ జర్నల్ తో పాటు కాన్ఫరెన్స్ అబ్ స్ట్రాక్ట్ బుక్ లెట్ లో ప్రచురిస్తామని వారు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనాలనే ఆసక్తి వున్నవారు డిసెంబర్ 6వ తేదీ నుంచి తమ పేర్లు నమోదు చేసుకుని, జనవరి 1, 2025లోగా అమూర్త పత్రాలను సమర్పించవచ్చన్నారు. అవసరమైన వారికి రోజువారీ అద్దె ప్రాతిపదికన వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.పేర్ల నమోదు, రుసుము, ఇతర వివరాల కోసం డాక్టర్ ప్రతీక్ పాఠక్, డాక్టర్ ఆశిష్ ఆర్ ద్వివేదిలను సంప్రదించాలని, లేదా(healthcarenext2025@gitam.edu )కు ఈమెయిల్ చేయాలని సూచించారు.

## ఘనంగా 78వ హోంగార్డ్స్ రైసింగ్ డే




విశ్వంభర, కరీంనగర్ :హోంగార్డ్ ల సేవలను గుర్తు చేసుకునేందుకు గాను ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా డిసెంబర్ 6వ తేదీన హోంగార్డ్స్ రైసింగ్ డే ని జరుపుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. కరీంనగర్ కమీషనరేట్ నందు శుక్రవారంనాడు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలోని అన్నీ విభాగాల్లో హోంగార్డులు సేవలు అందిస్తున్నారన్నారు. కరీంనగర్ కమీషనరేట్ నందు ముఖ్యంగా బ్లూ కోల్ట్స్ , ట్రాఫిక్ , శాంతి భద్రతల విధులు, నైట్ పెట్రోలింగ్ లతో పాటు కమీషనరేట్ లో దాదాపు హోం గార్డులు పని చేయని విభాగం లేదన్నారు. గడిచిన అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల లో కూడా వారికీ కేటాయించబడిన విధులు చాలా అద్భుతంగా నిర్వహించారని ఈ సందర్బంగా గుర్తుచేశారు. యూనిఫామ్ ధరించాక అందరం సమానమని , క్షేత్ర స్థాయిలో హోం గార్డ్ లే ఎక్కువ ప్రజలకు అందుబాటులో ఉంటారని కావున క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కమీషనరేట్ వ్యాప్తంగా వారికి కేటాయించబడిన విధుల్లో ప్రతిభ కనబరచిన 15 మంది హోంగార్డులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, రిజర్వు ఇన్స్పెక్టర్లు మోడెం సురేష్ (హోం గార్డ్స్), శ్రీధర్ రెడ్డి (సంక్షేమం) లతో పాటు ఇతర అధికారులు ,హోంగార్డులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను కలిసిన ప్రొబిషనరీ ఎస్ఐలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన 7 మంది ప్రొబిషనరీ ఎస్ఐలు మర్యాద పూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రొబిషనరీ ఎస్ఐలకు ఒక నెల రోజుల శిక్షణ గురించి మహబూబాబాద్ జిల్లా పరిధిలో పోలీస్ స్టేషన్లకు కేటాయించడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, నీతి నిజాయితీగా విధులు నిర్వహించి డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించవద్దన్నారు. అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రతి వార్డులు పరిశుభ్రంగా ఉండాలి



విశ్వంభర. మహేశ్వరం: ప్రజపాలన విజయోత్సవాలలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవలలో భాగంగా తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డు బాలాజీ నగర్ కాలనిలో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో తుక్కుగూడ చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్, మున్సిపల్ కమిషనర్ వాణి రెడ్డి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ జపాల భావన సుధాకర్ ,14వ వార్డ్ కౌన్సిలర్ రాజమోని రాజు, మున్సిపల్ మేనేజర్ టి.పర్వతాలు, వార్డు ఆఫీసర్స్ మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మందు ఆ తర్వాత చిందు

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం కు పూజల నిమిత్తం వచ్చే భక్తులు ఆలయం ముందు, ప్రజల ఇండ్ల ముందు బహిరంగంగా మద్యం సేవించడం చర్చనీయాంశమైంది. కొందరు భక్తులు ఆలయం ముందు వాహనాలు నిలిపి సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ బహిరంగంగా గ్లాసుల్లో మద్యం సేవిస్తూ ఉండగా గ్రామ ప్రజలు తమ సెల్ఫోన్ లలో చిత్రీకరించారు.తమ పెద్దలు చనిపోతే కాళేశ్వరం నకు పూజల నిమిత్తం వచ్చే భక్తులు మద్యం,మాంసం సేవించటం పరిపాటిగా మారింది.అయితే ఆలయానికి దూరంగా అడవిలో చెట్ల కింద వంట చేసుకొని మద్యం,మాంసం సేవించే భక్తులు ఇప్పుడు బహిరంగంగా ఆలయ పరిసరాల్లో మద్యం సేవించడం తో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వచ్చే భక్తులను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



హనుమకొండ సుబేదారిలో

## స్వీట్స్ షాప్ ప్రారంభం



**విశ్వంభర, హనుమకొండ :** హనుమకొండ సుబేదారిలోని గట్టు మహేష్ బాబు కాంప్లెక్స్ లో నూతనంగా నిర్వాహకులు గుల్లం ఉమా మహేశ్వర్ రావు, గుర్రం అంకిత్ కురవేళ్ళ ప్రవీణ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మిఠాయి పొట్లం స్వీట్స్ షాప్ ను శుక్రవారం రిబ్బన్ కట్ చేసి పూజా కార్యక్రమాలతో నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త గట్టు మహేష్ బాబు, ప్రముఖ సీనియర్ న్యాయవాదులు వద్దిరాజు గణేష్,వెంకటేశ్వరరావు, పశుపతి ఈశ్వర్ నాథ్, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న సంజీవరెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్ లో మోటకొండూరు మండలంలోని అమ్మనబోల్, మధిర , అభిద్ నగర్ గ్రామానికి చెందిన లోట్ల బాపురెడ్డి కుమారుడు ఎల్లారెడ్డి, తుమ్మలగూడెం గ్రామానికి చెందిన సింగనబోయిన జంగయ్య కుమార్తె శైలజ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధువారులను ఆశీర్వదించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలేరు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెసు పార్టీ నాయకులు యెల్లంలా సంజీవరెడ్డి. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల బైండోవర్




**విశ్వంభర, వరంగల్ :** మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టులపై భారాస పార్టీ శుక్రవారం ఛలో హైదరాబాద్ పిలుపు నిచ్చింది. దాంతో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని భారాస నాయకులను శుక్రవారం తెల్లవారు జామున స్టేషన్ లో ఎస్సై శ్రీకాంత్ ఎస్సై రాజు బైండోవర్ చేశారు. అదే రోజు సాయంత్రం విడుదల చేసినట్లు వెల్లడించారు. భారస పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్ తెలంగాణ ఉద్యమకారుడు, నేరెళ్ల రాజు మూడో డివిజన్ అధ్యక్షుడు, పస్తం యాదగిరి తెలంగాణ ఉద్యమకారుడు, పత్రి రాజపోషాలు నాయకులు, పస్లాది మల్లయ్య ఎస్సార్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు, గంధం గోవిందు భారస వరంగల్ జిల్లా నాయకులు, పస్తం నరసింగం సీనియర్ నాయకులు, సౌరం కళ్యాణ్ ఏనుమాముల శాఖ అధ్యక్షులు, సౌరం కవి రాజు తదితరులు ఉన్నారు.


## మాణిక్ ప్రభు మందిరంలో విఘ్నేశ్వర ప్రతిష్ట ఉత్సవాలు



**విశ్వంభర , పెద్ద శంకరంపేట :** దత్త జయంతి ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేటలోని మార్తాండ మాణిక్య ప్రభు మందిరంలో శుక్రవారం విగ్నేశ్వర ప్రతిష్టా కార్యక్రమం చేపట్టారు. అనంతరం పట్టణానికి చెందిన రాజన్ గౌడ్ భక్తులకు గురు చరిత్ర పుస్తకాలను ఆలయ కమిటీ బాధ్యుల సమక్షంలో పంపిణీ చేశారు. శనివారం నుండి ఆలయంలో భక్తులు గురు చరిత్ర. పుస్తక పఠనం వారం రోజులపాటు సప్తహ కార్యక్రమంలో భాగంగా పటించడం జరుగుతుందన్నారు. మాణిక్ ప్రభు మందిరంలో విఙ్ఞేశ్వరుడి ప్రాణ ప్రతిష్ట ఉత్సవాలను సైతం నిర్వహించారు.

# భూనిర్వాసితులకు అండగా ఉంటాం..

- అధికారులు ఇష్టానుసారంగా సర్వేలు చేయడం మంచి పద్ధతి కాదు : చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి
- రైతుల కోసం ఎంతవరకైనా పోరాడుతాం : అందెల శ్రీరాములు



**విశ్వంభర, మహేశ్వరం :** కందుకూరు మండలంలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకై 330 ఫీట్ల రోడ్డు కోసం భూములను కోల్పోతున్న రైతులను చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి పరామర్శించి వారికి మనో ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా సర్వే నిర్వహించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దని వారికి అండగా భారతీయ జనతా పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే శ్రీరాములు మాట్లాడుతూ త్వరలోనే రైతుల పక్షాన పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు రైతులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం రైతులందరూ కలిసి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బిజెపి జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, కందుకూరు మండల మాజీ ఎంపీపీ మంద పాండు జ్యోతి, బిజెపి సీనియర్ నాయకులు బిక్షపతి, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ పాండు, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, రైతు నాయకులు సుధాకర్ రెడ్డి, బిజెపి బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో
## హోమ్ గార్డ్ రైసింగ్ డే వేడుకలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం హోంగార్డ్ రైసింగ్ డే వేడుకల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పాల్గొని కేక్ కట్ చేసి హోంగార్డులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు స్వతంత్ర భారతదేశంలో స్వచ్ఛంద సంస్థగా 1946 డిసెంబర్ 6వ తేదీన ఏర్పాటు చేసింది భారత ప్రభుత్వం. కావున ప్రతి సంవత్సరం డిసెంబర్ 6వ తేదీన హోంగార్డు రైజింగ్ డే గా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా హోంగార్డులు సమయానుసారంగా విధులకు హాజరవుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. అన్ని క్లిష్టతరమైన బందోబస్తులు, శాంతి భద్రతల పరిరక్షణలో నిర్వహించే పోలీసుల అన్ని విభాగాల్లో హోంగార్డుల సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా పాటిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలొ ఏ.ఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్.ఐ (హోమ్ గార్డ్) భాస్కర్, ఆర్.ఐ (వెల్ఫేర్) నాగేశ్వరావు, హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

**- రంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పు**



**విశ్వంభర, మాడుగుల :** మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళపై అత్యాచారం చేసిన కేసులో రంగారెడ్డి జిల్లా ఎల్బీ నగర్ కోర్టు లో అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి 6గురు నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష, ఐదుగురికి సంవత్సర కాలం శిక్ష విధించిందని సీఐ జగదీష్ తెలియజేశారు. సీఐ వివరాల ప్రకారం నిందితులు ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన మస్జీద్, గౌసియా, షేక్ సయీద్, షేక్. మహబూబ్, షేక్. సలేహా, కైరూన్ బేగం, కలిసి నాగిళ్ల గ్రామానికి చెందిన మహిళపై 2017 లో అత్యాచారం చేసిన కేసులో మస్జిద్ కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఆరువేల రూపాయల జరిమానా మిగతా వారికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా మరియు బాధితురాలికి మూడు లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చిందని మాడుగుల సిఐ జగదీష్ తెలిపారు.

## మత్స్యావతారంలో పిల్లలమర్రి చెన్నకేశవ స్వామి



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట రూరల్ మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు ముదుంభై రఘువరన్ ఆచార్యులు స్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి పూజలు చేశారు.శుక్రవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు మాట్లాడుతూ ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీనాధునికి ప్రతి శుక్రవారం విశేష పుష్పాలంకరణ ఫలాలంకరణ సేవా కార్యక్రమాలు జరుగుతాయని ప్రతినెల శుక్లపక్ష ఏకాదశి నాడు స్వామివారి మాస కల్యాణము మరియు ప్రతి నెల రెండో శనివారం సాయంత్రం ఏడు గంటలకు సహస్రదీపాలంకరణ సహిత ఊంజల్ (ఉయ్యాల) సేవ నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ ఛైర్మన్ గూగంటి రాజాబాబు రెడ్డి మాట్లాడుతూ పురాతన ఆలయాలకు ప్రసిద్ధి చెందిన పిల్లలమర్రి చెన్నకేశవ స్వామివారి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 16న ధనుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభం అవుతున్నాయని ఈ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు కూడా భక్తిశ్రద్ధలతో పాల్గొని నెలరోజుల పాటు జరిగే ధనుర్మాసం వత మహోత్సవాలను ఘనంగా పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కందగట్ల రాంబాబు, మంగపండ్ల మల్లికార్జున్, చెరుకుపల్లి క్రిష్టయ్య , చెరుకుపల్లి సైదమ్మ , మల్లయ్య తూటిపల్లి జానయ్య , గంపల శంకర్ , అంకంభిక్షం , మహిళా భక్తులు ముదుంభై సారిక,గూకంటి స్వరూప, గవ్వ విజయలక్ష్మి, సువర్ణ ,అహల్య తదితరులు పాల్గొన్నారు.

## దేశాయిపల్లి గ్రామంలో చెరువు కబ్జా.. పట్టించుకోని అధికారులు



**విశ్వంభర, దేశాయిపల్లి :** పనికి ఆహార పథకంలో భాగంగా 1992లో చెరువును గ్రామస్తుల సహకారంతో నిర్మించుకున్నారు. ఇట్టి చెరువు కట్టను అనుకొని సుమారు 30 గుంటల వరకు సంకినేని గోపాలరావు, సంకినేని కరుణాకర్ రావు ఇరువురు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు,రైతులు ఆరోపించారు. గతంలో నుండి ప్రతి సంవత్సరం ఏటా బతుకమ్మ పండుగ వచ్చినప్పుడు గ్రామస్తుల సహకారంతో మొరం పోసి తోవ్వను నిర్మించుకున్నామని ఆ తోవ్వనుండే దుర్గమ్మ గుడికి, కొండ పోచమ్మ గుడికి నిత్యం భక్తులు దర్శనానికి వెళ్తారని తెలిపారు. నిర్మించుకున్న ఈ చెరువు ప్రాంతంలో రెండు బోర్లు వేసుకొని గ్రామస్తుల తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇదే కట్టను అనుకొని రైతుల బర్లు, గొర్లు మెపు కోవడానికి నిత్యం వెళ్తామని ఈ కట్టను అనుకుని బాట ద్వారా కింది పొలాలకు రైతులు నిత్యం వెళుతుంటామని ప్రస్తుతం తూమును అనుకోని క్రింది ప్రాంతం అంతా పొలాలుగా మార్చడంతో ఇరిగేషన్ నియమ నిబంధనలు తుంగలో తొక్కారని అటు రైతులకు ఇటు భక్తులకు ఇబ్బందిగా మారిందని వాపోయారు. బాటను కబ్జా చేయడం దారుణం అన్నారు. పోలీసులు వచ్చి చూసి వెళ్లిన ఇప్పటివరకు తమకు న్యాయం జరగలేదని ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చిన ఇరిగేషన్ అధికారులు కూడా స్పందించడం లేదని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న చెరువు కట్టను సంరక్షించి రైతులకు గ్రామస్తులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా తుమ్మల కొమురయ్య, తుమ్మల ఎల్లయ్య, పోచయ్య, తుమ్మల మల్లేశం, సతీష్ లు మాజీ సర్పంచ్ గ్రామస్తులు రైతులు కోరారు.

## సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక సమ్మె



**విశ్వంభర, త్రిపురారం:** నల్గొండ జిల్లా త్రిపురారం స్థానిక మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) దగ్గర విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపుమేరకు మండల విద్యాధికారి త్రిపురారం కి రిలే మరియు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఇందులో భాగంగా రిలే నిరాహార దీక్ష మొదటి రోజు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా త్రిపురారం మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అప్పటి ప్రతిపక్ష హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, అది తక్షణం వీలుకాని పక్షంలో వెంటనే పే స్కేల్ అమలు చేస్తామని, అప్పటి మా హనుమకొండ దీక్ష శిబిరానికి వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. మరి ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నప్పటికీ ఏ హామీ కూడా నెరవేరలేదని వెంటనే మాకు మీరు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, రాములు,బాలయ్య,జానిపాష, సలీం,అదీలేదు,నాగలీల,కలకొండ రాము తదితరులు పాల్గొన్నారు.

### పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులు
# ఏడాదిలో చేసి చూపించాం

- అధికారం కోల్పోయిన అహంకారం తగ్గలేదు
- బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్ మాత్రమే మిగిలే పరిస్థితి
- బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కిస్మత్ రెడ్డి లా మారిపోయారు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్




**విశ్వంభర, హైదరాబాద్ :** పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసి చూపించిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు . తెలంగాణలోని అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్కు పాలన కనిపిస్తున్నదని చెప్పారు . ఏడాది పాలనలో ప్రజంతా సంతోషంగా ఉన్నారని అందుకే ప్రభుత్వం పండగ నిర్వహిస్తున్నదన్నారు. ఈ ప్రజా పాలన పండగలో అందరూ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుందని ఆయన ఆరోపించారు.నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో గత ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కాంగ్రెస్ మార్క్ పాలన కనిపిస్తోందన్నారు. ప్రజాపాలన పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన దోపిడీ అంతా ఇంతా కాదన్నారు.

అధికారం కోల్పోయిన కేటీఆర్ లో ఏమాత్రం అహంకారం తగ్గలేదని మహేష్ గౌడ్ మండిపడ్డారు. ఇప్పటికైన కేటీఆర్ పగటికలలు కనడం మానేయాలని హితవు పలికారు. బిఆర్ఎస్ హయంలో లక్షల కోట్లు దోపిడీ జరిగిందని, ఇక ఆపార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ చెబుతున్నారని, కానీ రాజీవ్ గాంధీ, ఆయన కుటుంబం చేసిన త్యాగం తెలుసా? అని ప్రశ్నించారు. వారి కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించిందన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్ చేసిన త్యాగం ఏమిటో చెప్పాలని నిలదీశారు. సర్వ సంపదను దేశానికి త్యాగం చేసింది గాంధీ కుటుంబం అయితే రాష్ట్ర ప్రజల సంపదను దోచుకున్న కుటుంబం కేసీఆర్ కుటుంబమని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పెడుతున్న విగ్రహం తెలంగాణ ను ప్రతిబింబించే విధంగా ఉందని,ఆనాడు బిఆర్ఎస్ పెట్టిన విగ్రహం దొరకు ప్రతిబింభంగా ఉందని ఎద్దేవ చేశారు.దేశం లో అతి తక్కువ సమయం లో ఎక్కువ దోచుకుంది కెసిఆర్ కుటుంబం మాత్రమేనని అన్నారు. సీఎం రేవంత్ పాలనలో ఎలాంటి నిర్బంధం లేదని.. ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ గా నిరసన తెలుపుకునే అవకాశం ఉందన్నారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లి ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదన్నారు. బిఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుతో.. తండ్రి కొడుకు లు తప్ప ఎవరు ఆపార్టీలో మిగిలే పరిస్థితి లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కౌశిక్ రెడ్డి వాడిన భాష సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని.. చట్టం ఎవరికి చుట్టం కాదని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు.

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కిషన్ రెడ్డి, కిస్మత్ రెడ్డి లా మారిపోయారని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిన మేలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మూసి గురించి మాట్లాడే బీజేపీ నేతలు, సభర్మతి గురించి ఎందుకు మాట్లాడటం లేదని? అక్కడ పేదలకు ఒక్క ఇల్లు ఇవ్వలేదని గుర్తు చేశారు. పేదలకు గురించి మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు లేదని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## హోంగార్డుల పనితీరు ప్రశంసనీయం




**విశ్వంభర, భూపాలపల్లి :** పోలీసు శాఖలో హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పోలీస్ శాఖలో ఒక భాగమై, పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డులు అందిస్తున్న సేవలు కొనియాడదగినవని అన్నారు. విధినిర్వహణలో హోంగార్డ్ అంకిత భావంతో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతయుతమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నగేష్, రత్నం, సురేందర్ రెడ్డి పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, జిల్లా హోంగార్డులు పాల్గొన్నారు.

## శిలాఫలకాలు వేశారు.. డ్రైనేజీ నిర్మాణం మరిచారు




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో గత ఐదు నెలల క్రితం పంచాయతీ రాజ్ నిధులు ఐదు లక్షలు రూపాయలతో మోరి నిర్మిస్తామని శిలాఫలకం వేశారు. రామన్నపేట ఏడవ వార్డులో ప్రభుత్వ హాస్పటల్ ప్రహరి గోడ నుండి దావునూరి వెంకటేశం ఇంటి వరకు నూతన మోరిని నిర్మిస్తామని గత ఐదు నెల క్రితం శిలాఫలకం వేశారు. ఇంతవరకు ఎలాంటి నిర్మాణం చేయలేదని సిపిఐఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందుల హనుమంతు, టౌన్ కార్యదర్శి ముకుంట్ల లెనిన్ మాట్లాడుతూ మోరీలు పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైనేజీ తీవ్రంగా చెడిపోవడంతో పందులకు, దోమలకు నిలయంగా మారిందని, మోరీల ద్వారా మురికి వాసన వెదజల్లుతుందని, కాలనీ ప్రజలకు, బాటసారులకు ఇబ్బందిగా ఉందని వారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బావండ్లపల్లి బాలరాజు, గోరిగె సోములు, గాదె నరేందర్, బి.సత్యం, తరికోప్పల వెంకటరెడ్డి, గంజి అశోక్, కుందూరు వెంకటేశం, గౌరిగె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి

**పేట మండల పశు వైద్యాధికారి నాగార్జున పాటిల్**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పాడి రైతులు తమ పశువుల పెంపకంలో పోషణ జాగ్రత్తలు తీసుకోవాలని పెద్ద శంకరంపేట మండల పశు వైద్యాధికారి నాగార్జున పాటిల్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని విరోచపల్లిలో జిల్లా పశుసంవర్ధక శాఖ సహకారంతో గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు పశుపోషణ పై అవగాహన కల్పించడంతోపాటు పాడి పశువులు సకాలంలో ఎదకు వచ్చేలా చూడాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి గోపాలమిత్ర జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం గౌడ్. మహేశ్వర్ రెడ్డి పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విక్రమ్ కుటుంబనికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల ఘడియ గౌరారం గ్రామానికి చెందిన చెట్టిమళ్ళ వెంకయ్య, వెంకటమ్మ కుమారుడు చెట్టిమళ్ళ విక్రమ్ అకస్మిక మరణం వారి కుటుంబానికి తీరనిలోటు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు అన్నారు. ఆయన కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఉజ్జిని హేమలత నరేందర్ రావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా వుంటుందని ఆయా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉజ్జిని రఘు రామ్ రావు, గుండెబోయిన శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపిటిసి కంబాలపల్లి స్వాతి గిరి, నాగమళ్ళ యాదగిరి, అదిరాల కృష్ణయ్య,గుండెబోయిన సైదులు, తుళ్ళ రమేష్, కంబాలపల్లి సైదులు, కంబాలపల్లి జంగయ్య, నారిమల్ల యాదయ్య, షేక్ ముబీన్, కంబాలపల్లి శేఖర్, ఉడుత మరయ్య, ఈద క్రిష్టపరి, కంబళ్లపల్లి సోని, నర్సింహా, చెట్టిమాళ్ళ యేసు, ఆనంద్,నాగార్జున, నారిమల్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజీల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**విశ్వంభర, మహబూబాబాద్ :** అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ బాలికలు, కేజీవిబీ లను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్, స్కూల్ లో పరిసరాలు డైనింగ్ హాల్, వంటగది, తరగతి గదులు, మరుగుదొడ్లు, స్టడీ రూమ్స్, లైబ్రరీ, క్రీడా మైదానం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనో ప్రకారం నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిత్యవసర వస్తువులను జాగ్రత్తగా భద్రపరచాలని, వసతి గృహంలో నిరంతరం విద్యుత్తు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాకు వివరాల రిజిస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. విద్యార్థుల యొక్క ఆరోగ్య, మానసిక పరిస్థితులను గమనిస్తూ ఉండాలని, షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. హాస్టల్లో ప్రతినిత్యం సానిటేషన్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫుడ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రత్యేక అధికారులు నిత్యం పద్ధతి గృహాలను, అన్ని విద్యాసంస్థలను తనిఖీలు చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం, విద్యలలో నిర్లక్ష్యం వాయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన ద్వార స్థాపన



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులలో భాగంగా శుక్రవారం నాడు ఆలయ ధర్మకర్తలు ఆలయ ప్రధాన ద్వార స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితులచే ఈ కార్యక్రమానికి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు సుమారు 250 సంవత్సరాల చరిత్ర కలిగిన వేణుగోపాల స్వామి ఆలయం మంటపం గోపురం భాగం పాక్షికం గా దెబ్బతినడంతో ఆలయ ధర్మకర్తలు ఆలయాన్ని తొలగించి అదే స్థానంలో సుమారు రెండు కోట్ల వ్యయంతో తమిళనాడు శిల్పులచే పునర్నిర్మాణ పనులు చేపట్టాడు.

# కాంగ్రెస్ ఎంపీ సీటు వద్ద నోట్ల కట్ట

## రాజ్యసభలో ఆందోళన



**దిల్లీ:** రాజ్యసభలో కరెన్సీ నోట్ల కట్ట సంచలనం సృష్టించింది. కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపీ సీటు వద్ద దీన్ని గుర్తించినట్లు ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సభలో ప్రకటించడం తీవ్ర దుమారానికి దారితీసింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీని పై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని భాజపా డిమాండ్ చేసింది. అసలేం జరిగిందంటే..? పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభ శుక్రవారం సమావేశమైంది. ఈసందర్భంగా ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. ''గురువారం సభను వాయిదా వేసిన తర్వాత భద్రతా అధికారులు ఛాంబర్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే 222వ నంబరు సీటు వద్ద ఓ నోట్ల కట్టను గుర్తించారు. అది తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కి కేటాయించిన సీటు. ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకురాగానే దర్యాప్తునకు ఆదేశించా'' అని వెల్లడించారు.

**ఖర్గే అభ్యంతరం..**

రూ.500, రూ.100 కరెన్సీ నోట్లు ఉన్న కట్టను గుర్తించినట్లు ధన్‌ఖడ్ తెలిపారు. ఆ నోట్లు అసలైనవో.. నకిలీవో స్పష్టత లేదన్నారు. ఈ విషయాన్ని సభకు చెప్పడం తన బాధ్యత అన్నారు. దీంతో ఇది కాస్తా వివాదానికి దారితీసింది. ఛైర్మన్ ప్రకటనను సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఖండించారు. ఈ ఘటనపై విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన ఆయన.. దర్యాప్తు పూర్తికాకముందే సభ్యుడి పేరు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అయితే, ఖర్గే వ్యాఖ్యలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తప్పుబట్టారు. ''పేరు చెబితే తప్పేంటీ? ఏ సీటు వద్ద నగదు దొరికిందో.. అక్కడ ఎవరు కూర్చుంటారో ఛైర్మన్ చెప్పారు. అందులో సమస్య ఏముంది? ఇలా నోట్ల కట్టలను సభకు తీసుకురావడం సరికాదు. దీనిపై సీరియస్‌గా దర్యాప్తు జరగాలి'' అని అన్నారు. రాజ్యసభ సమగ్రతకు అవమానం కలిగించారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

**స్పందించిన సింఘ్వీ..**

మరోవైపు, ఈ పరిణామాలపై కాంగ్రెస్ ఎంపీ సింఘ్వీ స్పందించారు. తాను కేవలం ఒకేఒక్క రూ.500 నోటు తీసుకొచ్చానని తెలిపారు. ''ఇలాంటి పరిస్థితిని నేనెన్నడూ చూడలేదు. నిన్న రాజ్యసభకు వచ్చేటప్పుడు నా జేబులో కేవలం ఒక రూ.500 నోటు మాత్రమే ఉంది. నిన్న మధ్యాహ్నం 12.57 గంటలకు సభ లోపలికి వచ్చా. ఒంటి గంటకు సభ వాయిదా పడటంతో క్యాంటీన్‌కు వెళ్లా. మధ్యాహ్నం 1.30 గంటలకు పార్లమెంట్ నుంచి వెళ్లిపోయా'' అని సింఘ్వీ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

## ముఖ్యమంత్రితో కేంద్రబృందం భేటీ




**చెన్నై:** ముఖ్యమంత్రి స్టాలిన్‌తో కేంద్ర బృందం భేటీ అయింది. ఫెయింజల్ తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం శుక్రవారం చెన్నై చేరుకుంది. కేంద్ర హోంశాఖ డిప్యూటీ కార్యదర్శి రాజేష్ గుప్తా నేతృత్వంలోని బృందంలో పొన్నుసామి, సోన్‌మణి హోపమ్, శరవణన్, ధనపాలన్ కుమరన్, రాహుల్ పచ్‌కేటీ, బాలాజీ తదితర అధికారులు ఉన్నారు. తుపానుకు అన్ని రకాల ముందస్తు హెచ్చరిక చర్యలు తీసుకున్నామని, ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో వర్షం కురవటంతో కొన్నిచోట్ల నష్టాలు సంభవించాయని స్టాలిన్ తెలిపారు. నష్టాలను త్వరగా అంచనా వేసి కేంద్రానికి తెలియజేయాలని కోరారు. ఇదిలా ఉండగా రాష్ట్ర విపత్తు సహాయ నిధికి కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంగా రూ.944.80 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ అనుమతిచ్చినట్లు సమాచారం. రూ.2 వేల కోట్లు కావాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్రప్రభుత్వానికి లేఖ రాశారు.

## కోల్‌కతా, త్రిపురల నుంచి దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించిన బంగ్లాదేశ్



**ఢాకా:** భారత్‌లోని ఇద్దరు సీనియర్ దౌత్యవేత్తలు తక్షణమే తిరిగి రావాలని బంగ్లాదేశ్‌ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది. కోల్‌కతాలోని డిప్యూటీ హైకమిషనర్ షిక్దార్ మహమ్మద్ అష్రఫుల్ రహ్మాన్, అగర్తలలోని అసిస్టెంట్ హైకమిషనర్ ఆరిఫ్ మహమ్మద్‌ను రీకాల్ చేస్తున్నట్లు బంగ్లా ప్రభుత్వం ప్రకటించింది. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడానికి నిరసనగా పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి. ఈనేపథ్యంలో ఈ దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించినట్లు తెలుస్తోంది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వీరిద్దరూ ఢాకా నుంచి పనిచేయాలని సూచించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో అష్రఫుల్ రహ్మాన్ నిన్ననే బంగ్లాదేశ్‌కు చేరుకొన్నట్లు తెలుస్తోంది. ఇక త్రిపురలోని ఆరిఫ్ రేపు స్వదేశానికి వెళ్లిపోనున్నారు.ఇటీవల త్రిపురలోని అగర్తలాలో ఉన్న బంగ్లాదేశ్ అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయం ముందు వందల మంది ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ ఆఫీస్‌ను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొందరు కార్యాలయంలోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై బంగ్లాదేశ్ విదేశాంగశాఖ స్పందిస్తూ.. ఉద్దేశపూర్వకంగానే ఆందోళనకారులను కార్యాలయంలోకి అనుమతించారని ఆరోపించింది. ఈసందర్భంగా బంగ్లాదేశ్ పతాకం, కొన్ని వస్తువులు ధ్వంసమైనట్లు పేర్కొంది. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌కు మద్దతుగా త్రిపుర రాజధాని అగర్తలలో ఆందోళనకారులు సోమవారం బంగ్లా అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాన్ని ముట్టడించిన విషయం తెలిసిందే. భద్రతా కారణాల దృష్ట్యా ఈ కార్యాలయంలో కాన్సులర్ సేవలను ప్రస్తుతానికి నిలిపేశారు. ఈనేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని భారత్ హైకమిషనర్ ప్రణయ్ వర్మ.. అక్కడి విదేశాంగ ఉన్నతాధికారులతో భేటీ అయిన విషయం తెలిసిందే. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారత్ ఆందోళన వ్యక్తంచేసింది.

## న్యూయార్క్ టైమ్స్ మోస్ట్ స్టైలిష్ పీపుల్ లిస్టులో అనంత్-రాధిక



**దిల్లీ:** ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ , ఫార్మా దిగ్గజం వీరేన్ మర్చంట్ కుమార్తె రాధికా మర్చంట్ వివాహం ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఇక ప్రతి వేడుకలో వధూవరులు ధరించిన దుస్తులు, ఆభరణాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశాయి. కాగా ప్రస్తుతం న్యూయార్క్ టైమ్స్ మోస్ట్ స్టైలిష్ లిస్టులో అనంత్-రాధిక చోటు సంపాదించుకొని.. మరో ఘనతను సొంతం చేసుకున్నారు. 'మోస్ట్ స్టైలిష్ పీపుల్ ఆఫ్ 2024' జాబితాలో అనంత్- రాధిక అత్యంత స్టైలిష్ వ్యక్తుల్లో ఒకరిగా చోటు సంపాదించుకున్నట్లుగా న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. వివాహ సమయంలో వారు ధరించిన దుస్తులు, నగలు, అత్యంత వైభవంగా జరిగిన వారి వివాహ కార్యక్రమాలు మొదలైన విషయాలను పరిగణలోకి తీసుకున్నట్లు వెల్లడించింది.

## అవకాశమిస్తే ఇండియా కూటమిని నడిపిస్తా

### మమతా బెనర్జీ ప్రతిపాదన



**కోల్‌కతా:** ప్రతిపక్ష ఇండియా కూటమి పనితీరు పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అవకాశం ఇస్తే ఇండియా కూటమి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధమని ప్రకటించారు.బెంగాల్ వార్తా చానెల్ న్యూస్ 18 బంగ్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా తన పాత్రను కొనసాగిస్తూనే ప్రతిపక్ష కూటమికి సారథిగా వ్యవహరిస్తూ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలనని చెప్పారు. ఇండియా కూటమిని తాను ఏర్పాటు చేశానని, అవకాశం ఇస్తే కూటమి సజావుగా నడిచేలా చూసుకుంటానని మమత చెప్పారు. బెంగాల్ నుంచే కూటమిని నడిపించగలనని పేర్కొన్నారు.

## పెద్దపల్లి ఎంపీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్

**విశ్వంభర, హైదరాబాద్:** పెద్దపల్లి ఎంపీ ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. తన నామినేషన్‌ను అకారణంగా రిజెక్ట్ చేశారని.. ఆ తర్వాత పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించారని స్వతంత్ర అభ్యర్థి, న్యాయవాది పులిపాక రాజ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ నాయకుడు గడ్డం వంశీ ఎన్నిక చెల్లదని.. పెద్దపల్లిలో ఎంపీ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని తన పిటిషన్‌లో పులిపాక రాజ్‌కుమార్ కోరారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎంపీలను పార్టీ చేస్తూ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఈపీ 31/2024 ద్వారా ఈ పిటిషన్ దాఖలు అయింది.

## కొడనాడు కేసులో మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు!



**చెన్నై:** ఏడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కొడనాడు హత్య, దోపిడీ కేసులో మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, శశికళ తదితరులను విచారించేందుకు సీబీసీఐడీ పోలీసులకు అనుమతినిచ్చింది. వారిద్దరినీ విచారించకుండా ఊటీలోని జిల్లా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను కోర్టు కొట్టివేసింది. కొడనాడు ఎస్టేట్‌లో 2017లో పోలీసులు దాదాపు ఐదేళ్లపాటు దర్యాప్తు జరిపినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ప్రభుత్వం మారిన తర్వాత కేసును సీఐడీకి అప్పగించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10 మందిని అరెస్టు చేశారు. సుమారుగా 100 మందిని విచారించారు. అయితే కేసులో పళనిస్వామి, శశికళను విచారించేందుకు గతంలో దిగువ కోర్టు అనుమతి ఇవ్వలేదు.దాంతో వారిని కూడా విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీసీఐడీ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ ఇద్దరి విచారణకు అనుమతిస్తూ ఆదేశాలు జారీచేసింది. అంతేకాకుండా ఎస్టేట్‌లో కనిపించకుండా పోయిన కొన్ని విలువైన వస్తువుల గురించి శశికళ, ఇళవరసిని ప్రశ్నించాలని ఆర్డర్ వేసింది.కాగా, 2017లో తమిళనా మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కాపలాదారుడు ఓం బహదూర్‌ను హత్యచేశారు. ఎస్టేట్‌లోని పలు వస్తువులన దోచుకెళ్లారు.

## 2వేల మందితో ఎస్‌డీఆర్ఎఫ్




### ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ దళంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు 2వేల మంది సిబ్బందితో ఏర్పాటైన ఎస్‌డీఆర్ఎఫ్.. భారీ అగ్ని ప్రమాదాలు, భూకంపం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు అత్యవసరంగా సహాయక చర్యలు చేపట్టనుంది. అగ్నిమాపక కేంద్రాలు ఇక నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా మార్పు చెందనున్నాయి. జులై, ఆగస్టు నెలల్లో సంభవించిన వరదలకు పలు ప్రాంతాలు నీటమునిగిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో సుశిక్షుతులైన దళం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఎస్‌డీఆర్ఎఫ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.35.03 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అధునాతన పరికరాలు, కొత్త అగ్నిమాపక వాహనాలు కొనుగోలు చేసి సిబ్బందికి ఎస్‌డీఆర్ఎఫ్ ప్రాథమిక కోర్సుల్లో శిక్షణ ఇప్పించారు. అగ్నిమాపక శాఖకు చెందిన వెయ్యి మందికి తమిళనాడులోని అరక్కోణం, మహారాష్ట్రలోని పుణే, గుజరాత్‌లోని వడోదరా, ఏపీలోని కృష్ణాజిల్లాలో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ కేంద్రాల్లో శిక్షణ ఇప్పించారు.

## అయ్యప్ప క్షేత్రంలో నటుడికి వీఐపీ దర్శనం

### టీడీబీపై కేరళ హైకోర్టు ఆగ్రహం




శబరిమల: శబరిమల అయ్యప్ప క్షేత్రంలో నటుడికి వీఐపీ దర్శనం కల్పించడాన్ని కేరళ హైకోర్టు తప్పుపట్టింది. ట్రావెన్‌కోర్ బోర్డుపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. మలయాళ నటుడు దిలీప్ గురువారం శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సమయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి చూడాల్సి వచ్చింది. ఈ కారణంగా కొందరు భక్తులు దేవుడిని దర్శించుకోకుండానే వెనుదిరిగారు.ఈ ఘటనపై మీడియాలో వచ్చిన వార్తా కథనాల ఆధారంగా కేరళ హైకోర్టు ఈ విషయాన్ని సుమోటోగా తీసుకుంది. చాలా సమయం నటుడు ఆలయంలో ఉండటానికి ఎలా అనుమతించారని టీడీబీని ప్రశ్నించింది. నటుడివల్ల పిల్లలు, వృద్ధులు గంటల తరబడి క్యూలైన్‌లలో వేచిచూడాల్సి వచ్చిందని మండిపడింది. దేవస్థాన యాజమాన్యమే ఇలా చేస్తే భక్తులు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారికి మాత్రమే వీఐపీ దర్శనం కల్పించాలని, ఇతరులకు ప్రత్యేక దర్శనం కల్పించడం నిబంధనలకు విరుద్ధమని కోర్టు ట్రావెన్‌కోర్ బోర్డుపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనపై విచారణ చేపట్టి శనివారం లోగా వివరాలను కోర్టుకు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది.

## తెలంగాణ చరిత్రపై రేవంత్ రెడ్డి దాడి చేస్తుండు..

### దాసోజు శ్రవణ్ ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి మీద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. పూర్వకాలంలో భారతదేశంపై విదేశీయులు దండయాత్రలు చేసి, దేవతా విగ్రహాలను ధ్వంసం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి అదే పంథాలో పయనిస్తూ తెలంగాణ చరిత్రపై దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ చిహ్నాలపై కూడా దాడి చేస్తున్నాడని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి విధ్వంసం చేస్తుండు అని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. కాకతీయ కళాతోరణంపై కుల వివక్ష చూపిస్తుండని అన్నారు. చార్మినార్ ఆనవాళ్లను చెరిపివేయాలనే కుట్రలు చేస్తుండని మండిపడ్డారు. బాబాసాహెబ్ విగ్రహాన్ని కేసిఆర్ నిర్మించాడనే కోపంతో అవమానిస్తూ ఉన్నాడని విమర్శించారు. రేవంత్ రెడ్డిని మూర్ఖుడిగా పేర్కొంటూ.. అతని మనసును ఎప్పటికీ మార్చలేమని చెబుతూ భర్తృహరి రచించిన ఒక పద్యాన్ని పోస్టు చేశారు.

- దాసోజు శ్రవణ్ ట్వీట్ చేసిన భర్తృహరి పద్యం...
- తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు
- దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు
- తిరిగి కుందేటి కొమ్ము్మ సాధింపవచ్చు
- చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు

## దేశంలో తొలిసారిగా బధిరులకు టీవీ చానల్

### చానల్ 31ను ప్రారంభించిన కేంద్రం




**న్యూదిల్లీ:** బధిరుల కోసం దేశంలో తొలిసారిగా ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (ఐఎస్ఎల్) టీవీ చానల్, చానల్ 31ను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు బధిరులకు జాతీయ, ప్రైవేట్ చానళ్లలో రోజుకో వారానికో ఒక గంటో, అరగంటో కేటాయిస్తున్నారు. అయితే ఈ చానల్‌లో 24 గంటలూ వారికి కార్యక్రమాలు ఉంటాయి.ప్రధాని ఈ-విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ చానల్‌ను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహిస్తుంది. సెంట్రల్, స్టేట్ పాఠ్యాంశాలతో కూడి ఉండే కార్యక్రమాలను బధిరులు వీక్షించవచ్చు. ముఖ్యంగా టీచర్లు, విద్యార్థులు, ప్రత్యేక బోధకులకు ఉపయుక్తంగా ఉంటాయి. ఇందులో కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్యం వంటి కార్యక్రమాలు ఉంటాయని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

## సివిల్ సర్వీస్ అభ్యర్థుల నిరసన..

### పోలీసులు లాఠీచార్జ్

**పాట్నా:** సివిల్ సర్వీస్ అభ్యర్థులు నిరసన చేపట్టారు. కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్ష సాధారణీకరణను వ్యతిరేకించారు. ఈ పరీక్షలో మార్పులు చేయవద్దని, పాతపద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సివిల్ సర్వీస్ అభ్యర్థులు నిరసనకు దిగారు. బెయిలీ రోడ్‌లోని బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) ఎదుట ఆందోళన చేపట్టారు. 70వ కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్షను నార్మలైజ్ చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే పరీక్షా విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. నిరసనకు దిగిన సివిల్ సర్వీస్ ఔత్సాహిక అభ్యర్థులను చెదరగొట్టారు. మరోవైపు బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) దీనిపై స్పందించింది. నార్మలైజేషన్ కోసం కమిషన్ ఎలాంటి ప్రణాళిక ప్రకటించలేదని కార్యదర్శి స్పష్టం చేశారు. దీని గురించి వస్తున్న పుకార్లను కొట్టిపారేశారు. అభ్యర్థులు ఆందోళన వీడి ప్రిపరేషన్‌పై దృష్టిసారించాలని సూచించారు.

విశ్వంభర V3 NEWS

# ‘ఒక కుటుంబం నుంచి ఒక ఐటీ ప్రొఫెషనల్’

- సీఎం చంద్రబాబు కొత్త నినాదం ఇదే!
- పర్యాటక రంగంలోనూ కొత్త విధానాలు తీసుకొచ్చేలా ఆలోచనలు
- ఆహార ఉత్పత్తులు, సరఫరాలో గ్లోబల్ హబ్‌గా ఏపీ



**విశ్వంభర, అమరావతి:** ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో యువత సమర్థులుగా మారుతున్నారని.. ఏపీ నాలెడ్జ్ హబ్‌గా తయారవుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖలో గురువారం నిర్వహించిన డీప్ టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విదేశాల్లో మన దేశ ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువారేనని అన్నారు. డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని.. పర్యాటక రంగంలోనూ కొత్త విధానాలు తీసుకొచ్చేలా ఆలోచనలు చేస్తున్నట్లు చెప్పారు. 1995లో తొలిసారిగా సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేసినట్లు గుర్తు చేశారు. ‘పీపీపీ పద్ధతిలో హైటెక్ సిటీని నిర్మించాం. ఇప్పటివరకూ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు జరిగేవి. కొత్తగా పీ4 విధానం తీసుకొస్తున్నాం. ఇక నుంచి ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్య విధానంతో ముందుకెళ్తాం’ అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త, ఒక ఐటీ ప్రొఫెషనల్ ఉండాలనే నినాదం తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ‘ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడైనా సాంకేతికతపైనే చర్చ జరుగుతోంది. రోజురోజుకూ కొత్త మార్పులు వస్తున్నాయి. జీవితంలో టెక్నాలజీ ఓ భాగంగా మారింది. భారత్‌లో ఆధార్ సాంకేతికత అనుసంధానంతో అన్ని వివరాలు తెలుస్తున్నాయి. పర్యాటక రంగంలోనూ కొత్త విధానాలు తీసుకొచ్చేలా ఆలోచన చేస్తున్నాం. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ కీలకంగా మారింది. వాటితోనూ అన్ని పనులూ చేసుకునే పరిస్థితికి వచ్చాం. నదుల అనుసంధానంతో నీటి కొరత అనేదే ఉండదు. ఆహార ఉత్పత్తులు, సరఫరాలో గ్లోబల్ హబ్‌గా ఏపీ మారబోతోంది. అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. పెట్టుబడులతో వస్తోన్న వారికి రాష్ట్రంలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం.’ అని సీఎం తెలిపారు. పరిపాలనలో టెక్నాలజీని భాగస్వామ్యం చేయడమే కొత్త టార్గెట్ అని సీఎం అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో 15 శాతం వృద్ధిరేటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జనాభా ఇప్పుడు ఆస్తిగా పరిగణించే పరిస్థితులు ఏర్పడ్డాయని.. పాపులేషన్ మేనేజ్మెంట్ అనేది ఇప్పుడు కీలకంగా మారిందన్నారు. పాపులేషన్, టెక్నాలజీ ఆధారంగా గ్లోబల్ హబ్‌గా ఇండియా మారుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. అటు, వ్యవసాయ రంగంలో ఏపీ ముందుందని.. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు టెక్నాలజీని అనుసంధానం చేసి మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏఐ, ఎంఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌తో ఆర్థిక, విద్య, వైద్య రంగాల్లో మార్పులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు.

## వైసీపీలో ఉంటే భూములు కొనుక్కోవద్దా..

టీడీపీ నాయకులపై మాజీ మంత్రి ధ్వజం



**విశ్వంభర, తాడేపల్లి:** ఏ ఒక్క రైతు నుంచి తాను భూమిని లాక్కోలేదని మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజా వెల్లడించారు. మార్కెట్ రేటు కంటే ఎక్కువకే సెజ్‌లో భూములు కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తునిలో దాడిశెట్టి రాజా మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీలో ఉంటే భూములు కొనుక్కోకూడదా అని ప్రశ్నించారు. దీనిపై బురద జల్లడమే కొంతమంది పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు ఈ మధ్య భూములు కొనుక్కున్నారని.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిఠాపురంలో 15 ఎకరాల భూమి కొనుగోలు చేశారని దాడిశెట్టి రాజా తెలిపారు. గత పదిరోజుల్లో యనమల రామకృష్ణుడు రెండు ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, యనమల రామకృష్ణుడు ఏ రైతులు, పేదల నుంచో భూములను లాక్కున్నారని తాను కూడా ఆరోపించగలనని తెలిపారు. ఒక్క బకెట్ బురద జల్లితే సరిపోతుందా అని మండిపడ్డారు. వైసీపీలో ఉంటే భూములు కొనుక్కోవద్దా అని నిలదీశారు. తమది మొదట్నుంచి వ్యాపార కుటుంబం అని.. తాము అందరిలాగే చట్టబద్ధంగా భూములు కొంటే తప్పేముందని ప్రశ్నించారు. యనమల రామకృష్ణుడు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు చందాలు వేసుకుని గెలిపించారని దాడిశెట్టి రాజా గుర్తుచేశారు. మరి అదే యనమల ఇప్పుడు డిస్టలరీలు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఇన్ని భూములు ఎలా కొనుగోలు చేశారని, అంత ఆస్తి ఎలా సంపాదించారని నిలదీశారు. అక్రమ ఆస్తులు కూడబెట్టిన యనమల, వాటిని పేద ప్రజలకు పంచి పెట్టాలని.. అప్పుడు నీతులు చెబితే బాగుంటుందని సూచించారు.

## ఏపీ వెళ్లేవారికి అందుబాటులోకి పికప్ వ్యాన్‌లు

**విశ్వంభర, హైదరాబాద్:** దూర ప్రాంత ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లో ఆర్టీసీ పికప్ వ్యాన్‌ల సేవలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. తొలి విడతలో ఈసీఐఎల్- ఎల్బీనగర్ మధ్య ఉన్న ప్రాంతాల నుంచి ఈ పికప్ వ్యాన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దూరప్రాంత ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఈ పికప్ వ్యాన్‌లను తీసుకొచ్చింది. విజయవాడ, విశాఖ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, కందుకూరు వెళ్లేవారి కోసం ఈ పికప్ వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కాప్రా మున్సిపల్ కాంప్లెక్, మౌలాలీ హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, హెచ్ఎంటీ నగర్, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్ మెట్రో స్టేషన్, నాగోల్, సుప్రజ ఆస్పత్రి, ఎల్బీనగర్ ఎల్‌పీటీ మార్కెట్ నుంచి పికప్ వ్యాన్‌లు అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలకు 040-69440000, 040-23450033 నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ తెలిపింది.

## మైనర్‌పై లైంగిక దాడి..

**విశ్వంభర, కర్నూలు:** జిల్లా దేవనకొండ మండలంలో దారుణం చోటు చేసుకుంది. మైనర్ బాలికపైఅత్యాచారం చేసిన నిందితుడికి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి అతడి ఇంటికి నిప్పు అంటించారు. మండలంలోని చెల్లెలిచెలిమా గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలికపై నిందితుడు వేంకటేశ్వర్లు అత్యాచారానికి పాల్పడడంతో బాలిక కేకలు వేసింది. దీంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయే యత్నం చేయగా అతడిని పట్టుకుని దేహశుద్ధి చేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులు నిందితుడు ఉంటున్న ఇంటికి వెళ్లి పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీస్తున్నారు. మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కామందుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీస్ బలగాలు మోహరించారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ‘సిట్’ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- చీఫ్‌గా వినీత్ బ్రిజ్‌లాల్‌కు బాధ్యతలు

**విశ్వంభర,అమరావతి:** రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం ‘సిట్’ను ఏర్పాటు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుగురు సభ్యులతో కూడిన సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు. సిట్ సభ్యులుగా సీఐడీ ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీలు అశోక్ వర్ధన్, గోవిందరావు, డీఎస్పీలు బాలసుందర్‌రావు, రత్తయ్యలను నియమించారు. ప్రతి 15 రోజులకోసారి కేసు పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ప్రభుత్వం.. సిట్‌కు పూర్తి స్థాయి అధికారాలు అప్పగించింది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కాకినాడలో 13 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.



## దళితుల సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్: మంత్రి నిమ్మల



**[వి]శ్వంభర, విజయవాడ:** గత ఐదేళ్లలో దళితుల సంక్షేమ పథకాలను మాజీ సీఎం జగన్ రద్దు చేసి వారికి వెన్నుపోటు పొడిచారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఆయన రక్తదానం చేశారు. అంతకుముందు ఆసుపత్రిని తనిఖీ చేసి రోగుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత 18 ఏళ్లుగా అంబేడ్కర్ వర్ధంతి రోజు తమ తండ్రి పేరుతో ఉన్న ధర్మారావు ఫౌండేషన్ పేరిట రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను రక్తదానం చేయడం ఇది 24వ సారి అని తెలిపారు.

“గతంలో టీడీపీ హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌ను సమర్థంగా అమలు చేస్తే.. వైకాపా పాలనలో ఆ నిధులను సైతం దారి మళ్లించారు. దళిత వ్యక్తిని వైకాపా ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేస్తే.. అతడిని సన్మానించిన ఘనుడు జగన్. పార్లమెంట్, అసెంబ్లీలో దళితులకు ఉన్నత పదవులు కట్టబెట్టిన ఘనత తెదేపాది. అంబేడ్కర్ స్ఫూర్తితో చంద్రబాబు పనిచేస్తున్నారు. జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతికి శాసనసభ స్పీకర్ పదవి ఇచ్చాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎస్‌గా దళిత బిడ్డ కాకి మాధవరావును నియమించారు. ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసి జస్టిస్ పున్నయ్యను దానికి ఛైర్మన్‌గా నియమించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్నాం” అని మంత్రి చెప్పారు.

## జగన్‌ను అవమానించేలా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు: అంబటి రాంబాబు



**విశ్వంభర, అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు చెందిన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జై టీడీపీ ట్విట్టర్ పేజీలో వైసీపీ నాయకులను అవమానించే విధంగా మంత్రి నారా లోకేష్ సృష్టించిన రోబో సీమరాజు అనే వ్యక్తి వైసీపీ కండువా వేసుకుని పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ పోస్టులతో మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని సీఐ నుంచి డీజీపీ స్థాయి వరకు వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ సతీమణి భారతి మీద కూడా అసభ్యంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రైవేటు కేసులు వేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తామని హెచ్చరించారు. కూటమి నాయకులకు భయపడే ప్రసక్తేరాదని వెల్లడించారు. గత నెలలో ఫిర్యాదు చేసిన వాటిపై పోలీసులు ఇంతవరకు కేసులు నమోదు చేయలేదని ఆరోపించారు. టీడీపీ సోషల్ మీడియాపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని వివరించారు. జగన్‌కు సన్నిహితంగా ఉన్న వాళ్లపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు.

## వివేకా హత్య కేసులో సునీత మరో పిటిషన్..

భాస్కర్‌రెడ్డికి నోటీసులు

**ఢిల్లీ:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సునీత సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. నిందితుడు భాస్కర్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ జరిపింది. భాస్కర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది.



# శ్రీశైల మల్లన్న సేవలో నాగచైతన్య, శోభిత

**విశ్వంభర, శ్రీశైలం:** ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున కుటుంబం శ్రీశైల మల్లన్నను దర్శించుకుంది. ఇటీవల నాగచైతన్య, శోభిత వివాహం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన వధూవరులతో కలిసి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికారు. తొలుత ఆలయ మహాద్వారం వద్ద వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఇక నాగచైతన్య- శోభిత పెళ్లి ఫొటోలను తాజాగా నాగార్జున తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. మీడియాకు, ఫ్యాన్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ‘డియర్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ, ఫ్యాన్స్.. మీ ప్రేమ, ఆశీస్సులు ఈ వేడుకను ప్రత్యేకం చేశాయి. ఈ అందమైన క్షణాల్లో మమ్మల్ని అర్థం చేసుకున్న మీడియాకు ధన్యవాదాలు. కృతజ్ఞతతో నా హృదయం ఉప్పొంగుతోంది’ అని పేర్కొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పీఏ సహా 11 మంది అరెస్ట్



**విశ్వంభర, గన్నవరం:** ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితులుగా ఉన్న 11 మందిని శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. వీరిలో వంశీ పీఏ రాజా కూడా ఉన్నారు. విజయవాడ గ్రామీణం, గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరుకు చెందిన మరికొందరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశముంది.

## ఎంబీబీఎస్‌లో సీటు రాకపోవడంతో రైలు కిందపడి యువతి ఆత్మహత్య

**విశ్వంభర, అమరావతి :** తల్లిదండ్రుల కళలను, తన ఆశయాన్ని నెరవేర్చేందుకు ఎంబీబీఎస్ సీటు సాధన కోసం అహర్నిశలు కష్టపడ్డా ఫలితం రాకపోవడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన తనూజ చిత్రదుర్గం వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు కోసం రెండుసార్లు ప్రయత్నించి విఫలమయ్యింది. మూడోసారి కూడా సీటు రాకపోవడంతో మనస్థాపానికి గురై బెంగళూరు నుంచి హొస్పేట్‌కు వెళుతూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ చేసి చెప్పింది. అనంతపురం జిల్లా రాయదుర్గం శివారు ప్రాంతంలో తాను ప్రయాణిస్తున్న రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమె మృతదేహం రైల్వేట్రాక్‌పై పడి ఉండడంతో ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కిందపడి చనిపోయిందని పోలీసులు భావించారు. మృతురాలి తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించారు. ఎంబీబీఎస్‌లో సీటు రాకపోవడంతోనే ఆత్మహత్య చేసుకుందని బోరున విలపిస్తూ ఫిర్యాదు చేశారు.

## విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి



**విశ్వంభర, విజయవాడ:** కేంద్ర మంత్రి, నటుడు సురేష్ గోపీ విజయవాడలోని దుర్గమ్మను శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు మంత్రి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం ప్రారంభానికి వచ్చిన సందర్భంగా ఇంద్రకీలాద్రిని దర్శించుకున్నారు. కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తోందని అన్నారు . ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కళలకు ప్రాచుర్యం కల్పిస్తున్నామని, ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని సంగీత కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఎంతో మంది అద్భుతమైన సంగీతకారులు తెలుగులోనే ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని సరికొత్త ఏపీని తయారు చేస్తున్నారని ప్రశంసించారు. సంగీత టూరిజంకు గ్లోబల్ హబ్‌గా ఏపీని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. తన ఆదాయం, గ్లామర్ మూడోవంతుకు పైగా ఏపీ, తెలంగాణ నుంచి వచ్చినవేనని గుర్తు చేశారు.

## తిరుచానూరులో వైభవంగా పద్మావతి అమ్మవారి పంచమీ తీర్థం



**విశ్వంభర, తిరుపతి :** తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అఖరు రోజు శుక్రవారం పంచమి తిథిని పురస్కరించుకుని అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో స్నానం ఆచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ముందుగా పంచమి తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళు ,, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన పూలమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. అంతకుముందు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈవో, అదనపు ఈవోలకు టీటీడీ తరుపున సారెను అందజేశారు. సారెకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు-కుంకుమ, చందనం, పట్టుచీరతో పాటు రూ కోటి 20 లక్షలతో వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన స్వర్ణ కిరీటం, వజ్రాలహారం, గాజులు, దుద్దెలు సారెగా సమర్పించారు.

## శిక్షణ పేరుతో యువకుడికి చిత్రహింసలు..


స్పందించిన మంత్రి లోకేశ్



**విశ్వంభర, శ్రీకాకుళం:** ఆర్మీ శిక్షణ పేరుతో యువకుల్ని చిత్రహింసలకు గురి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శ్రీకాకుళం జిల్లాలో విశ్రాంత ఆర్మీ అధికారినంటూ వెంకటరమణ అనే వ్యక్తి స్థానికంగా ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వహిస్తున్నాడు. ఆర్మీ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వటానికి ఒక్కొక్కరి నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. శిక్షణ కోసం వచ్చిన ఓ యువకుడిని సంస్థ డైరెక్టర్ రమణ కరెంట్ వైరుతో విచక్షణారహితంగా చితక బాదాడు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ వీడియోను కొందరు మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ చేసి స్పందించాలని కోరారు. యువకుడిపై దాడిని మంత్రి లోకేశ్ ఖండించారు. కారకులపై శ్రీకాకుళం పోలీసులు చర్యలు తీసుకుంటారని లోకేశ్ తెలిపారు.

## బిగ్ ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రెడీ..

సెబీకి దరఖాస్తు




**విశ్వంభర (బిజినెస్):** దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఎల్‌జీ అనుబంధ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు రాబోతోంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఈ పబ్లిక్ ఇష్యూ జరగబోతోంది. ప్రమోటర్ సంస్థ అయిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐఎన్‌సీ 10.18 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఈ సేల్‌కు మోర్గాన్ స్టాన్లీ, జేపీ మోర్గాన్, యాక్సిస్ క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, సిటీ గ్రూప్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. ఐపీఓ ద్వారా రూ.15,237 కోట్లు సమీకరించనున్నట్లు తెలుస్తోంది. దక్షిణ కొరియాకే చెందిన హ్యుందాయ్ మోటార్ రూ.27 వేల కోట్లు సమీకరించిన కొద్ది రోజులకే ఎల్‌జీ ఐపీఓకు వస్తుండడం విశేషం. ఎల్‌జీ సంస్థ దేశీయంగా వాషింగ్ మెషిన్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లను విక్రయిస్తోంది. దేశీయంగా శాంసంగ్, వాల్‌పూల్ సంస్థలు గట్టి పోటీనిస్తున్నాయి.

## తొలి రోజు ఆస్ట్రేలియాదే పైచేయి..

- పింక్ బాల్ టెస్టులో టీమిండియా 180 పరుగులకు ఆలౌట్
- కీలక ఇన్నింగ్స్ ఆడిన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి



**అడిలైడ్:** బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్, భారత్ మధ్య గురువారం రెండో టెస్టు ప్రారంభమైన విషయం తెలిసిందే. పింక్ బాల్ (డే/నైట్)తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఆస్ట్రేలియానే పైచేయి సాధించింది. తొలుత టీమ్ఇండియాను 180 పరుగులకే ఆలౌట్ చేసి కంగారులు.. బ్యాటింగ్‌లోనూ జోరు ప్రదర్శించారు. తొలి రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ 86/1 స్కోరుతో పటిష్ట స్థితిలో నిలిచింది. మార్నస్ లబుషేన్ (20బీ బ్యాటింగ్ 67 బంతుల్లో 3 ఫోర్లు), మెక్‌స్వీనీ (38బీ బ్యాటింగ్ 97 బంతుల్లో 6 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఉస్మాన్ ఖవాజా (13)ను బుమ్రా ఔట్ చేశాడు. జట్టు 24 పరుగుల వద్ద ఉండగా ఖవాజా బుమ్రా బౌలింగ్‌లో స్లిప్‌లో రోహిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఇంకా 94 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆరంభంలోనే భారత బౌలర్లు వీలైనన్ని ఎక్కువ వికెట్లు పడగొట్టి కంగారులను ఒత్తిడిలోకి నెట్టాలి. లేకపోతే ఆసీస్ భారీ ఆధిక్యం సంపాదించడం ఖాయం. భారత బ్యాటర్లలో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (42బీ 54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ (6/48) దెబ్బకు భారత టాప్ ఆటగాళ్లు ఇబ్బంది పడ్డారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇన్నింగ్స్ తొలి బంతికే (స్టార్క్ బౌలింగ్) డకౌట్ కాగా.. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (37బీ 64 బంతుల్లో 6 ఫోర్లు), వన్‌డౌన్ శుభ్‌మన్ గిల్ (31బీ 51 బంతుల్లో 5 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. స్టార్క్ బౌలింగ్‌లో రాహుల్ మెక్‌స్వీనీకి క్యాచ్ ఇవ్వడంతో 69 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే కోహ్లీ (7) స్లిప్‌లో స్మిత్‌కు చిక్కగా.. బోలాండ్ బౌలింగ్‌లో శుభ్‌మన్ గిల్ ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు చేరాడు. రెండో సెషన్ ప్రారంభమైన కొద్దిసేపటికే రోహిత్ శర్మ (3)ను బోలాండ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నిలకడగా ఆడిన రిషభ్ పంత్ (21బీ 35 బంతుల్లో) కమిన్స్ వేసిన షార్ట్‌పిచ్ బంతిని ఆడబోయి లబుషేన్ చేతికి చిక్కాడు. రవిచంద్రన్ అశ్విన్ (22)ను స్టార్క్ వెనక్కి పంపాడు. ఈ క్రమంలో నితీశ్ రెడ్డి జస్‌ప్రీత్ బుమ్రా (0)ను మరో ఎండ్‌లో ఉంచి వేగంగా పరుగులు రాబట్టాడు. బుమ్రా తొమ్మిదో వికెట్‌గా, నితీశ్ రెడ్డి పదో వికెట్‌గా వెనుదిరిగారు.

## టెస్టుల్లో మరో ఘనతసాధించిన బుమ్రా..

ఈ ఏడాది 50 వికెట్లు సాధించిన తొలి బౌలర్‌గా రికార్డు



**అడిలైడ్:** టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా టెస్టుల్లో మరో రికార్డు సాధించాడు. ఈ ఏడాది సుదీర్ఘ ఫార్మాట్‌లో 50 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అడిలైడ్‌లో ఆసీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో ఉస్మాన్ ఖవాజాను ఔట్ చేసి 50 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. 11 టెస్టుల్లో బుమ్రా ఈ రికార్డు అందుకున్నాడు. ఈ క్రమంలో ఒక క్యాలెండర్ ఇయర్‌లో 50 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు సాధించిన మూడో భారత పేసర్‌గా రికార్డు సృష్టించాడు. బుమ్రా కంటే ముందు మాజీ పేసర్లు కపిల్‌దేవ్, జహీర్ ఖాన్ ఈ ఘనత సాధించారు. 1979లో కపిల్‌దేవ్ 17 మ్యాచ్‌ల్లో 74 వికెట్లు పడగొట్టాడు. 1983లో కపిల్ 18 టెస్టుల్లో 75 వికెట్లు తీసి తన రికార్డును మెరుగుపర్చుకున్నాడు. ఇక, జహీర్ ఖాన్ 2002లో 15 మ్యాచ్‌ల్లో 51 వికెట్లు పడగొట్టాడు. అనిల్ కుంబ్లే, రవిచంద్రన్ అశ్విన్, హర్భజన్ సింగ్, బి ఎస్ చంద్రశేఖర్, హిమ్మత్‌లాల్ మన్కడ్ కూడా ఒకే ఏడాది 50 కంటే ఎక్కువ వికెట్లు సాధించారు. కానీ, వీరంతా స్పిన్నర్లు. ఇక, ఆసీస్‌తో రెండో టెస్టు విషయానికొస్తే.. తొలి రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ 86/1 స్కోరుతో బలమైన స్థితిలో నిలిచింది. మార్నస్ లబుషేన్ (20బీ బ్యాటింగ్ 67 బంతుల్లో 3 ఫోర్లు), మెక్‌స్వీనీ (38బీ బ్యాటింగ్ 97 బంతుల్లో 6 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. తొలుత టీమ్ఇండియా 180 పరుగులకే ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (42బీ 54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్.

## మరోసారి విఫలమైన విరాట్ కోహ్లీ



అడిలైడ్: పింక్ బాల్ టెస్టులో భారత సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (7) విఫలమయ్యాడు. మరోసారి తన బలహీనతను బయటపెట్టిన కోహ్లీ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చేసి పెవిలియన్‌కు చేరాడు. అడిలైడ్ పిచ్‌పై కాస్త ఓపికగా ఉంటే పరుగులు రాబట్టవచ్చని కేఎల్ రాహుల్, గిల్ నిరూపించారు. కానీ, విరాట్ మాత్రం ఆఫ్‌సైడ్ వచ్చిన బంతిని కదిలించి మరీ వికెట్‌ను సమర్పించడం మాత్రం ఆపలేకపోతున్నాడు. ఆసీస్‌తో తొలి టెస్టులో సెంచరీ చేసిన విరాట్ ఫామ్ అందుకొన్నాడని సంబరపడిన అభిమానులను నిరాశపరిచాడు. దీంతో సోషల్ మీడియాలో అతడిపై మీమ్స్ వెల్లువెత్తాయి. విరాట్ ఔట్ కావడంపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ పోస్టు పెట్టాడు. "విరాట్ కోహ్లీ బ్యాటింగ్ సగటు దిగజారడానికి ముఖ్య కారణం ఒకటుంది. అంతకుముందు 50o ఉండే అతడి యావరేజ్ 48కి తగ్గింది. అవుట్‌సైడ్ ఆఫ్ బలహీనత అనే దురదృష్టం వెంటాడుతోంది. మరీ ముఖ్యంగా, ఆ బలహీనత నుంచి బయటపడేందుకు మరొక మార్గాన్ని ప్రయత్నించకపోవడం అతడి మొండితనంలా ఉంది" అని మంజ్రేకర్ పోస్టు పెట్టాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ గణాంకాలకు సంబంధించి మరో పోస్టును ఓ అభిమాని షేర్ చేశాడు. ఈ ఏడాది విరాట్ కేవలం ఒక్క సెంచరీ మాత్రమే చేయగా.. మరొక హాఫ్ సెంచరీ మాత్రమే అతడి ఖాతాలో ఉండటం గమనార్హం.

## అదరగొట్టిన యువ భారత్ జట్టు

- అండర్ -19 ఆసియా కప్ ఫైనల్‌కు చేరిన టీమిండియా
- ఫైనల్లో బంగ్లాతో అమీతుమీ

**షార్జా:** యువ భారత్ అదరగొట్టింది. అండర్-19 ఆసియా కప్‌లో ఫైనల్‌కు చేరింది. శుక్రవారం శ్రీలంకతో జరిగిన సెమీస్‌లో టీమ్ఇండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46.2 ఓవర్లో 173 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని భారత్ 21.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 13 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ (67బీ 36 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఆయుష్ మాత్రే (34బీ 28 బంతుల్లో 7 ఫోర్లు) రాణించాడు. ఈ ఓపెనింగ్ జోడీ తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని (8.3 ఓవర్లలోనే) నెలకొల్పింది. సూర్యవంశీ 24 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. సిద్ధార్థ్ (22), మహ్మద్ అమన్ (25లి), కార్తికేయ (11లి) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో విహాస్, వీరణ్ చముదిత, ప్రవీణ్ మనీషా తలో వికెట్ పడగొట్టారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంకను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. లక్విన్ (69) హాఫ్ సెంచరీ చేయగా.. షరుజన్ (42) ఫర్వాలేదనిపించాడు. చేతన్ శర్మ 3, కిరణ్ 2, ఆయుష్ 2.. హార్దిక్, గుహ చెరో వికెట్ తీశారు. భారత బౌలర్ల దెబ్బకు 8 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన లంకను లక్విన్ - షరుజన్ జోడీ ఆదుకుంది. నాలుగో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. మరోసారి భారత బౌలర్లు విజృంభించి లంక బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చారు.

**భారత్, బంగ్లా మధ్య ఫైనల్..**

మరో సెమీస్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ తలపడగా.. బంగ్లా ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 37 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. ఫర్హాన్ యూసఫ్ (32) టాప్ స్కోరర్. ఇక్బాల్ (4/24) అదరగొట్టాడు. మరుఫ్ 2.. ఫహద్, సర్కార్ దేబా ఒక్కో వికెట్ తీశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని బంగ్లా 22.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అజీజుల్ హకీమ్ తమీన్ (61లి) అర్ధ శతకం బాదాడు. జవాద్ అబ్రార్ (17), మహ్మద్ షిహాబ్ జేమ్స్ (26) పరుగులు చేశారు. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్‌లో భారత్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి.




## ఇన్వెస్టర్లకు నచ్చని ఆర్బీఐ నిర్ణయం..

ఓనష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లకు ఆర్బీఐ నిర్ణయం నచ్చలేదు. ఫలితంగా శుక్రవారం ఐదు సెషన్ల లాభాలకు బ్రేక్ పడింది. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి సమీక్షలో కీలక వడ్డీరేటు 6.5 శాతం యధాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నది. కానీ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7.2 నుంచి 6.5 శాతానికి కుదించేసింది. నెమ్మదించిన ఆర్థిక వృద్ధి రేటును పరుగులెత్తించేందుకు బ్యాంకులకు అవసరమైన నిధుల లభ్యత కోసం క్యాష్ రిజర్వ్ రేషియో (సీఆర్ఆర్)లో కోత విధించింది. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 56.74 పాయింట్లు (0.07 శాతం) నష్టపోయి 81,709.12 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 81.925.91 పాయింట్ల నుంచి 81,506.19 పాయింట్ల మధ్య తచ్చాడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50 30.60 పాయింట్ల పతనంతో 24,677.80 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 24,751.05 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి, 24,620.50 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది.

ఎన్ఎస్ఈ-50లో 32 స్టాక్స్ నష్టాలతోనే ముగిశాయి. అదానీ పోర్ట్స్, సిప్లా, భారతీ ఎయిర్ టెల్, హెచ్డీఎఫ్సీ లైఫ్, ఇండస్ఇండ్ బ్యాంక్ స్టాక్స్ 1.51 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, బీపీసీఎల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సహా 18 స్టాక్స్ 3.21 శాతం వరకూ లాభ పడ్డాయి. నిఫ్టీ మిడ్ క్యాప్-100 0.45 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.82 శాతం లాభాలతో ముగిశాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంకు, కన్జూమర్ డ్యూరబుల్స్, ఓఎంసీ, హెల్త్ కేర్, ఫైనాన్సియల్స్ లాభాలతో ముగిస్తే, మిగతా ఇండెక్సులు పతనం అయ్యాయి. జనవరి ఒకటో తేదీ నుంచి ధరలు పెంచుతున్నట్లు మారుతి సుజుకి, హ్యుండాయ్ మోటార్ ఇండియా ప్రకటించడంతో ఆటో స్టాక్స్ పుంజుకున్నాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్-30లో టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి, ఎల్ అండ్ టీ, ఐటీసీ ప్రధానంగా లాభ పడ్డాయి. అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్ టెల్, ఏషియన్ పెయింట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్ పతనం అయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ రూ.84.69 లకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ 71.62 డాలర్లు, ఔన్స్ బంగారం ధర 2660 డాలర్లు పలికాయి.

## జనవరి నుంచి మారుతి సుజుకి కార్ల ధరలు పెంపు..



**ముంబయి:** ఆడి ఇండియా, హ్యుందాయ్ మోటార్ ఇండియా బాటలోనే మారుతి సుజుకి ప్రయాణిస్తున్నది. జనవరి ఒకటో తేదీ నుంచి కార్ల ధరలు నాలుగు శాతం పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. మోడల్స్ వారీగా ధరల్లో మార్పులు ఉంటాయని వివరించింది. కార్ల తయారీ ఖర్చులు పెరిగిపోవడంతో కొంత భారం కస్టమర్లపై మోపక తప్పడం లేదని మారుతి సుజుకి తెలిపింది. జనవరి నుంచి కార్ల ధరలు పెరుగుతాయని ఈ నెల ప్రారంభంలోనే ఆడి ఇండియా ప్రకటించింది. అన్ని రకాల మోడల్ కార్లపై మూడు శాతం ధరలు పెంచుతున్నట్లు తెలిపింది. ఆడీ ఏ4, ఆడి క్యూ7, ఆడి ఈ-ట్రాన్ జీటీ, ఆడీ ఆర్ఎస్ క్యూ8 మోడల్ కార్లు అత్యంత పాపులర్. అన్ని మోడల్ కార్లపై గరిష్టంగా రూ.25 వేల వరకూ అన్ని కార్ల ధరలు పెంచుతామని గురువారం హ్యుండాయ్ మోటార్స్ ప్రకటించింది.

## గ్రీన్‌లైన్ సమస్యకు వన్‌ప్లస్ చెక్..

### భారత యూజర్లకు లైఫ్‌టైమ్ వారెంటీ



**ముంబయి:** చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వనప్లస్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. అమోలెడ్ డిస్‌ప్లే ఫోన్లలో తలెత్తుతున్న గ్రీన్-లైన్ సమస్యకు చెక్ పెట్టింది. తమ స్మార్ట్‌ఫోన్ కొనుగోలుదారులకు భరోసానిచ్చేందుకు 'గ్రీన్‌లైన్ వర్రీ ఫ్రీ సొల్యూషన్'ను శుక్రవారం ప్రకటించింది. ఇందులో భాగంగా భారత యూజర్లకు లైఫ్‌టైమ్ వారెంటీని ప్రకటించింది. దీంతో పాటు ఈ సమస్య తలెత్తకుండా మరో రెండు కొత్త చర్యలూ తీసుకుంది. వచ్చే ఏడాది జనవరిలో తన కొత్త ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ వన్‌ప్లస్ 13 లాంచ్ చేయనున్న వేళ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. చాలా స్మార్ట్‌ఫోన్లలో గ్రీన్‌లైన్ సమస్య ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ అప్‌డేట్ చేసిన తర్వాత ఆకుపచ్చ రంగులో ఉన్న కొన్ని గీతలు నిలువుగా యూజర్లకు దర్శనమిస్తున్నాయి. దాదాపు అన్ని కంపెనీల ఫోన్లలోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికే ఆయా కంపెనీలు చర్యలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో యూజర్ల నమ్మకాన్ని చూరగొనేందుకు వన్‌ప్లస్ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా భారత్‌లో అధిక వేడిమి, తేమ వాతావరణం కారణంగా గ్రీన్‌లైన్ ఇష్యూ తలెత్తకుండా స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లేలకు పీవీఎక్స్ లేయర్‌ను జోడించనుంది. దీంతో పాటు క్వాలిటీ కంట్రోల్‌లో భాగంగా 85 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, 85 శాతం తేమ వాతావరణంలో తమ స్మార్ట్‌ఫోన్లను కంపెనీ పరీక్షించనుంది. ఇందుకోసం 80 రకాల టెస్టులు నిర్వహించనుంది. చివరగా లైఫ్‌టైమ్ వారెంటీని ప్రకటించింది. గతంలోనూ ఎంపిక చేసిన మోడళ్లలో గ్రీన్‌లైన్ వస్తే ఉచిత స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్ చేసిన వన్‌ప్లస్.. ఇప్పుడు అన్ని మోడళ్లకూ ఈ వారెంటీని విస్తరించింది.

## మార్కెట్లోకి హోండా థర్డ్ జనరేషన్ అమేజ్..

రూ.7.99 లక్షల నుంచి ప్రారంభం..!




**ముంబయి:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా ఇండియా తన థర్డ్ జనరేషన్ సబ్ కంపాక్ట్ అమేజ్ కారు దేశీయ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.7.99 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమై రూ.10.89 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది. ఇవీ ఇంట్రడ్యూసరీ ధరలు అని, 45 రోజుల వరకూ బుకింగ్ చేసుకునే వారికి ఈ ధరలు వర్తిస్తాయి. వీ, వీఎక్స్, జడ్ఎక్స్ వేరియంట్లలో న్యూ అమేజ్ లభిస్తుంది. న్యూ మారుతి సుజుకి డిజైర్, హ్యుండాయ్ ఔరా, టాటా టైగోర్ వంటి పాపులర్ కంపాక్ట్ సెడాన్‌లతో పోటీ పడుతుంది. సెకండ్ లెవల్ అడాస్ షూట్ తో వస్తున్న హోండా అమేజ్ అత్యంత పాపులర్ కారు. కొల్లిషన్ మిటిగేషన్ బ్రేకింగ్, ఆటో హై బీం, అడ్వాన్స్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీపింగ్ అసిస్ట్, రోడ్ డిపార్చర్ మిటిగేషన్ తదితర ఫీచర్లు ఉన్నాయి. ఆసక్తి గల కస్టమర్లు ఆన్‌లైన్‌లో గానీ, సమీప డీలర్ల వద్ద గానీ బుక్ చేసుకోవచ్చు. 2025 జనవరి నుంచి డెలివరీలు ప్రారంభిస్తారు. హోండా న్యూ అమేజ్ కారు 1.2 లీటర్ల, ఫోర్ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ తదితర ఫీచర్లు ఉంటాయి. హోండా లేన్ వాచ్ కెమెరా ఉంటుంది. ఇది బ్లైండ్ స్పాట్ మానిటర్ మాదిరిగా పని చేస్తుంది.

## మ్యూల్ ఖాతాల ఏరివేతే లక్ష్యంగా ఆర్‌బీఐ మ్యూల్ హంటర్




**ముంబయి:** సాంకేతిక యుగంలో సైబర్ నేరగాళ్ల బెడద ఎక్కువైపోయింది. అమాయకులే లక్ష్యంగా సొమ్ములు కొల్లగొట్టి మోసాలకు పాల్పడటమే కాదు.. అలా కొట్టేసిన సొమ్మును నకిలీ ఖాతాలకు మళ్లిస్తున్నారు. ఆయా ఖాతాల నుంచి సొమ్మును తమ అవసరాలకు వాడుకుంటున్నారు. ముఖ్యంగా నిరక్ష్యరాస్యులు, నిరుద్యోగులకు కమీషన్ ఆశ చూపి వారి పేరుతో ఖాతాలు తెరుస్తున్నారు. వీటినే 'మ్యూల్ అకౌంట్లు'గా పిలుస్తారు. ఆయా ఖాతాల్లోకి వెళ్లిన సొమ్మును గుర్తించడం, రికవరీ చేయడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో మ్యూల్ ఖాతాల ఏరివేతే లక్ష్యంగా ఆర్‌బీఐ మ్యూల్ హంటర్.ఏఐను ప్రకటించింది. ఇందులో భాగస్వాములు కావాలని బ్యాంకులకు సూచించింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ఈ అంశం గురించి ప్రస్తావించారు. సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి మ్యూల్ ఖాతాలను వినియోగిస్తున్నారని చెప్పారు. మ్యూల్ ఖాతాలు సహా వివిధ ఆర్థిక మోసాలకు చెక్ పెట్టేందుకు 'జీరో ఫైనాన్షియల్ ఫ్రాడ్స్' పేరిట ఆర్‌బీఐ హ్యాకథాన్ నిర్వహిస్తోందన్నారు. దీంతో పాటు ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో పనిచేసే మ్యూల్ హంటర్.ఏఐ మోడల్‌ను ఆవిష్కరించినట్లు చెప్పారు. ఆర్‌బీఐకి చెందిన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ దీన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహిస్తోందన్నారు. ఈ మోడల్ మ్యూల్ ఖాతాలను సమర్థంగా గుర్తించగలదని దాస్ తెలిపారు. రెండు పెద్ద ప్రభుత్వరంగ బ్యాంకులతో కలిసి ప్రయోగాత్మకంగా నిర్వహించిన పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. మ్యూల్ ఖాతాలకు చెక్ పెట్టేందుకు మిగిలిన బ్యాంకులు కూడా ఇన్నోవేషన్ హబ్‌తో జట్టు కట్టాలని సూచించారు. ఆర్థిక మోసాలను నివారించడానికి బ్యాంకులు, ఇతర భాగస్వామ్యపక్షాలతో కలిసి పలు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బ్యాంకులు కూడా సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడంతో పాటు సైబర్ మోసాల నివారణ, లావాదేవీలపై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

విశ్వంభర
V3 NEWS



# 'మన దేశం' 75 ఏళ్ల వేడుకలపై సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్:**

సీనియర్ ఎన్టీఆర్ నటించిన తొలి చిత్రం 'మన దేశం'. ఈ సినిమా విడుదలై 75 ఏళ్లు పూర్తయిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా విజయవాడలో వేడుకను నిర్వహించాలని తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి నిర్ణయించింది. డిసెంబర్ 14న విజయవాడలో ఈ వేడుక జరగనుంది. దీని ఏర్పాట్ల కోసం బుధవారం హైదరాబాద్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ చిత్ర వాణిజ్యమండలి, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, తెలుగు సినీ రైటర్స్ అసోసియేషన్, తెలుగు సినీ దర్శకుల సంఘం ప్రతినిధులు అందరూ పాల్గొని వేడుక గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాతలు పెద్దఎత్తున పాల్గొనున్నట్లు తెలిపారు.

# మనం బతికేది బతుకు కాదు.. మనకంటే కాకి మేలు: పూరి జగన్నాథ్



'మనం బతికేది బతుకు కాదు' అని దర్శకుడు పూరి జగన్నాథ్ అన్నారు. 'పూరి మ్యూజింగ్స్' పేరుతో ఆయన పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మనిషి జీవితం గురించి తన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'లాడ్జ్' టైటిల్‌తో విడుదలైన వీడియోలో ఆయన చెప్పిన సంగతులివీ ''ఈ భూమ్మీద ఎన్నో కోట్ల జీవాలు తేలిగ్గా, సరదాగా, రూపాయి ఖర్చు లేకుండా బతుకుతున్నాయి. కానీ, ఇదే ప్లానెట్‌లో ప్రతి దానికీ డబ్బు కడుతూ బతుకుతున్న ఏకైక జీవి మనిషి. ఈ గ్రహం మనకు దేవుడు ఇచ్చింది. దానికి మనం డబ్బు ఎందుకివ్వాలి?పక్షి తనకు నచ్చిన చోట గూడు కట్టుకుంటుంది. చెట్టు తనకు ఇష్టమున్న ప్రాంతంలో మొలుస్తుంది. తిమింగలం తలచుకుంటే ప్రపంచ యాత్ర చేసొస్తుంది. అడవి దాటేందుకు సింహానికి పాస్‌పోర్టు అవసరం లేదు. ఆఫ్రికాలోని కొంగలు కొల్లేరు గెస్ట్‌హౌజ్‌లో కొన్నాళ్లు ఉండి వెళ్లిపోతాయి. ఇవన్నీ ఫ్రీగా, క్రెడిట్ కార్డులు లేకుండా బతుకుతున్నాయి. మనం తినాలన్నా డబ్బు కావాలి, ఇల్లు కట్టుకోవాలంటే స్థలం కొనాలి, నిర్మాణానికి అనుమతి తీసుకోవాలి, దేశ సరిహద్దు దాటాలంటే పాస్ పోర్టు కావాలి. ప్రపంచాన్ని ముక్కలు చేసేసుకున్నాం. అది వేరే దేశమట.. మనది కాదట. పైగా మన దేశంలో కూడా బతికినంత కాలం డబ్బు కడుతూనే ఉండాలట. చివరకు మన సమాధికీ మనీ పే చేయాలట. దారుణం కదా! ఈ పేమెంట్ సిస్టమ్ వల్ల ప్లానెట్ అర్థమే మారిపోయింది''. ''ఇది హోమ్ కాదు.. లాడ్జ్. మిగతా జీవులన్నింటికే ఇది హోమ్. మనకు మాత్రం కాదు. రోజూ రెంట్ కోసం.. అందమైన క్షణాలు అమ్ముకుంటున్నాం. ఎందుకు పని చేస్తున్నామో ఎవరికీ తెలియదు. ఎంజాయ్‌చేసే టైమ్ లేదు. ప్రపంచం తిరిగే సమయం లేదు. రాత్రంతా వెన్నెల చూస్తూ కూర్చొనే టైమ్ లేదు. డబ్బు కోసం పరుగు పెడుతున్నాం. ఆ రన్నింగ్ జీవితాంతం'' ''సముద్రం, పర్వతం, అడవి.. ఇలా అన్నీ దేవుడు మనకు ఉచితంగా ఇచ్చాడు. ఇసుక తిన్నెలు, హిమాలయాలు నీవే. అయినా మనం దేన్నీ ఆస్వాదించలేకపోతున్నాం. మనిషి వ్యవసాయం నేర్చుకుని స్థిరపడ్డాడు చూశారా..! అక్కడి నుంచి దారి తప్పాడు. జీవితంలో సెటిల్ అయ్యామని అనుకుంటే ఇరుక్కున్నట్టే. స్వేచ్ఛ ఉండదు. అందుకే తాడూ బొంగరం లేని జీవితం ఎంతో బాగుంటుంది. హాయిగా పక్షుల్లా ఎగురుకుంటూ వెళ్లొచ్చు. ఒకటి మాత్రం నిజం.. మనం బతికేది బతుకు కాదు. మన కంటే కాకి మేలు. మనం పుట్టింది అద్దెలు కట్టడానికా..? మళ్లీ జన్మంటూ ఉంటే మనిషిగా పుట్టించొద్దని దేవుడిని మొక్కుదాం. మనకు హోమ్ అవసరం.. లాడ్జ్ కాదు'' అని పేర్కొన్నారు.



# ఆ విషయంలో సమంతని ఫాలో అవుతున్న మహానటి.. కీర్తి సురేశ్

ఇండస్ట్రీలో వరుసగా పెళ్లి బాజాలు మోగుతున్నాయి. సెలబ్రిటీలు తమకు నచ్చిన వారితో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. తమ బ్యాచులర్ లైఫ్ కు గుడ్ బాయ్ చెప్తూ మ్యారేజ్ లైఫ్ లోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే నాగచైతన్య శోభితాలు తమ ప్రేమ బంధాన్ని వివాహ బంధంగా మార్చుకున్నారు. తాజాగా మరో టాలీవుడ్ హీరోయిన్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతుంది. ప్రస్తుతం ఈ హీరోయిన్ వెడ్డింగ్ కార్డు నెట్టింట్లో వైరల్ గా మారుతోంది. ఇంతకీ ఆ స్టార్ హీరోయిన్ ఎవరు? ఆ అమ్మడు ఎవరో కాదు.. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్. మలయాళం అమ్మాయి అయినా తెలుగులో వరుస సినిమా అవకాశాలను అందుకుంటూ విజయాలను అందుకుంది. కీర్తి సురేష్ బాలనటిగా తన సినీ కెరీర్ ను ప్రారంభించింది . 2000లో మలయాళం సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు ఎన్నో సినిమాలలో తన నటనతో అలరించింది. ఇక 'గీతాంజలి' అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది. ఈ మలయాళం ముద్దుగుమ్మ ఈ క్రమంలోనే టాలీవుడ్ లో ఆఫర్లు అందుకుంది. ఇలా రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన 'నేను శైలజ' అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కీర్తి సురేశ్.ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ కావడంతో వరుస ఆఫర్లను అందుకుంది. ఆ తర్వాత నాచురల్ స్టార్ నాని, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కింగ్ నాగార్జున వంటి స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశాన్ని పొందింది. ఇక కీర్తి సురేష్ కెరీర్లో 'మహానటి' సినిమా ఒక మైలురాయిగా చెప్పవచ్చు. అలనాటి సినీ తార సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాలో సావిత్రి పాత్రను నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది కీర్తి సురేశ్. ఈ సినిమాకు జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుంది. అప్పటినుండి భాషతో సంబంధం లేకుండా తెలుగు, హిందీ, తమిళం లో సినిమాలు చేస్తోంది. తన అందం అభినయంతో బ్యాక్ టు బ్యాక్ ఇట్స్ అందుకుంటూ స్టార్ హీరోయిన్ గా నిలిచింది.

# సన్నీ దేవోల్ జాట్ టీజర్ రిలీజ్



బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ యాక్షన్-ప్యాక్డ్ మూవీ 'జాట్' కోసం మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో ఫస్ట్ టైం కొలాబరేట్ అయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌తో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ సినిమాపై ఎక్సయిట్మెంట్ మరింతగా పెంచింది. టీజర్ రెండు పాత్రల మధ్య సాగే డైలాగ్ తో ప్రారంభమవుతుంది, వారిలో ఒకరు పోలీసు ఆఫీసర్. డైలాగ్ హీరో నటోరియస్ నేచర్, శత్రువులను భయపెట్టే విధ్వంస మార్గాన్ని తెలియజేస్తోంది. విలన్స్ చేతులు, కాళ్లను గొలుసులతో కట్టి ఉంచిన సన్నీ డియోల్ క్యారెక్టర్ ఇంటెన్స్ ఇంట్రడక్షన్ ని ప్రజెంట్ చేస్తోంది.టీజర్‌లోని చాలా మూమెంట్స్ సన్నీ డియోల్ ఫిజిక్ ప్రజెన్స్, ఇంటెన్స్ క్యారెక్టర్ గురించి తెలియజేస్తున్నాయి. మ్యాసీవ్ ఫ్యాన్ ని ఉపయోగించి ఫైట్ సీక్వెన్స్ అదిరిపోయింది. రణదీప్ హుడాను మెయిన్ విలన్ గా పరిచయం చేయడంతో టీజర్ థ్రిల్లింగ్ నోట్‌తో ముగిసింది. రాపిడ్-ఫైర్ యాక్షన్, స్టన్నింగ్ విజువల్స్‌తో టీజర్ రోలర్-కోస్టర్ రైడ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. ప్రతి సన్నివేశంతో ఆడియన్స్ ని సీట్ ఎడ్జ్ న ఉంచుతుంది. గ్లింప్స్ సూచించినట్లుగా, సన్నీ డియోల్, రణదీప్ హుడా మధ్య ఇంటెన్స్ పేస్ ఆఫ్ మెయిన్ హైలైట్‌లలో ఒకటి.దర్శకుడు గోపీచంద్ మలినేని మాస్-అప్పీలింగ్ యాక్షన్‌ని తీయడంలో తన స్కిల్ అద్భుతంగా చూపించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లపై నిర్మించిన ఈ సినిమా నిర్మాణ విలువలు అత్యద్భుతంగా వుంటాయి. S థమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ యాక్షన్ ని ఎలివేట్ చేసింది. రిషి పంజాబీ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని బ్రెత్ టేకింగ్ విజువల్ గా నిలిపింది. హార్డ్ హిట్టింగ్ డైలాగ్స్, ఎక్స్ ప్లోజివ్ యాక్షన్, పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో టీజర్ మాస్ ఫీస్ట్‌ను అందిస్తుంది. ఈ చిత్రంలోవినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్‌ను పర్యవేక్షించగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పీటర్ హెయిన్, అన్ల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు వర్క్ చేస్తున్నారు. ఏప్రిల్ 2025 వేసవిలో ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

# యోధుడి పాత్రలో సాయి ధరమ్ తేజ్..

**శరవేగంగా 'SDT18' షూటింగ్**

సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్‌న కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టిన విషయం తెలిసిందే. SDT18గా ఈ ప్రాజెక్ట్ రానుండగా.. హనుమాన్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాగా..




శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా నుంచి డిసెంబర్ 12న క్రేజీ అప్‌డేట్‌ను పంచుకోనున్నట్లు తెలిపారు. మారణహోమం సృష్టించడానికి వస్తున్నాడు అంటూ మూవీ నుంచి కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఇక ఈ సినిమాకు సంబరాల ఏటి గట్టు అనే టైటిల్ పెట్టాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. 1947 హిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుండగా.. ఇలాంటి టైటిల్ అయితేనే మూవీకి సరిపోతుంది అని చిత్రబృందం అనుకున్నట్లు టాక్. ఈ మూవీలో సాయి తేజ్ ఒక యోధుడి పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ఎస్‌డీటీ 18 రూపొందుతోంది.

# భారతీయ సినీ చరిత్రలో పుష్ప-2 రికార్డు

**RRRను దాటేసిన అల్లు అర్జున్..**

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పుష్ప ది రూల్'. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహించగా రష్మిక మందన్నా కథానాయికగా నటించింది. ఇక తెలుగు ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్‌గా మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఈ సందర్భంగా తాజాగా ఈ



సినిమా ఫస్ట్ డే కలెక్షన్‌లను చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది.'పుష్ప ది రూల్' ప్రపంచవ్యాప్తంగా మొదటిరోజు రూ.294 కోట్ల వసూళ్లు రాబట్టిందని మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ కలెక్షన్స్‌లో ఇండియా వైడ్ రూ.200 కోట్లు రాగా.. అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 150 కోట్లకు పైగా వసూలు చేసిందని సమాచారం. ఇక ఈ ఏడాదిలో మొదటిరోజు బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ ఇచ్చిన చిత్రంగా పుష్ప 2 రికార్డ్ క్రియేట్ చేసింది. అంతకుముందు ఈ రికార్డు ఎన్టీఆర్ నటించిన దేవరతో (రూ.172 కోట్లు) పాటు.. ప్రభాస్ కల్కి (రూ.192 కోట్లు) చిత్రాలపై ఉంది. ఓవరాల్‌గా ఇండియాలో ఫస్ట్ డే కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో పుష్ప 2 మొదటి స్థానంలో ఉండగా.. రాజమౌళి ఆర్ఆర్ఆర్ (రూ. 223 కోట్లు) రెండో స్థానంలో.. ప్రభాస్ బాహుబలి 2 (రూ. 214 కోట్లు), కల్కి (రూ.192 కోట్లు), సలార్ (రూ.178 కోట్లు) వరుసగా మూడు నాలుగు, ఐదు స్థానాల్లో ఉండగా.. ఎన్టీఆర్ దేవర (రూ.172 కోట్లు) ఆరో ప్లేస్‌లో ఉంది. ఇంకా ఇవే కాకుండా.. కేజీఎఫ్ (రూ.162 కోట్లు), లియో (రూ.140 కోట్లు) షారుఖ్ జవాన్, యానిమల్ తదితర చిత్రాలు ఉన్నాయి.

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com